APTEL 2009/31957
# నీలగిరి వార్త
మన కోసం మన వార్త తెలుగు దినపత్రిక
neelagirivartha@gmail.com
ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ | బుధవారం | 10 జూన్ 2026 | సంపుటి : 17 | సంచిక : 269 | పేజీలు : 12 | వెల : 5/-




హెచ్1 బి వీసాపై ట్రంప్‌కు షాక్
2 లో..

రిపోర్టర్లు కావలెను
తెలంగాణ, ఏపీ వ్యాప్తంగా 'నీలగిరి వార్త' దినపత్రి కలో పనిచేయడానికి రిపోర్టర్లు కావలెను. వివరాలకు 96765 49223 నంబర్‌లో సంప్రదించగలరు.
-ఎడిటర్

## తెలంగాణ మహిళలను మభ్య పెడుతున్న సిఎం

- ముందు అంగన్‌వాడీలకు జీతాలు చెల్లించండి
- ఎక్స్ వేదికగా మాజీ మంత్రి హరీష్ రావు విమర్శలు



**హైదరాబాద్, నీలగిరివార్త :**
అంగన్‌వాడీలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జీతాలు చెల్లించడం లేదంటూ బీఆర్ఎస్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. మహిళలను కోటీశ్వరులుగా చేస్తామని రేవంత్ మభ్య పెడుతున్నారని ఆగ్రహించారు. అంగన్‌వాడీలకు ముందు జీతాలు చెల్లించి మహిళలపై ముఖ్యమంత్రికి ఉన్న గౌరవాన్ని నిరూపించుకోవాలన్నారు. రెండు నెలలుగా జీతాలు అందక 62 వేల మంది అంగన్‌వాడీలు కష్టాలు పడుతున్నారని మాజీ మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఎమ్మెల్యే హరీశ్ రావు స్పందించారు. 'రెండు నెలలుగా జీతాలు రాకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న 62 వేల మంది అంగన్‌వాడీ సోదరీమణులకష్టాలు మీకు కనిపించడం లేదా? నెలల తరబడి జీతాలు ఇవ్వకుండా వేధిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తప్పకుండా వారి ఉసురు తగులుతుంది. సాటి మహిళల కన్నీటి గోసను మహిళా మంత్రిగా ఉన్న సీతక్క అర్థం చేసుకోకపోవడం శోచనీయం. గత ప్రభుత్వంలో అంగన్‌వాడీల సేవలను గుర్తించిన కేసీఆర్ వారి గౌరవాన్ని

మిగతా 2వ పేజీలో..

## భోజన బాధలు!

- పెరుగుతున్న ధరలతో మధ్యతరగతి అధోగతి
- ప్రజాపంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలి
- 14 రకాల నిత్యావసరాలు అందచేయాలి
- సివిల్ సప్లై కార్యాలయం ఎదుట ఐద్వా ధర్నా




**హైదరాబాద్, నీలగిరివార్త :**
పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేసి రేషన్ దుకాణాల ద్వారా బియ్యంతో పాటు 14 రకాల నిత్యావసర సరుకులను అందించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. కేంద్ర కమిటీ పిలుపు మేరకు హైదరాబాద్‌లోని సివిల్ సప్లై కార్యాలయం ఎదుట ఐద్వా ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఆర్. అరుణజ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న మల్లు లక్ష్మి మాట్లాడుతూ, 2014 ఎన్నికల సమయంలో బీజేపీ అధికారంలోకి వస్తే నిత్యావసర వస్తువుల ధరలను తగ్గిస్తామని హామీ ఇచ్చిందని, అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ధరల పెరుగుదలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు, పాఠశాల ఫీజులు నిరంతరం పెరుగుతున్నాయని, దీంతో సామాన్య ప్రజల జీవనం మరింత భారంగా మారిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ధరల పెరుగుదల కారణంగా కుటుంబాల

మిగతా 2వ పేజీలో..



## సౌ కరోడ్ పైనే!

- ఆర్అండ్‌బీ ఈఎన్‌సీ మోహన్‌నాయక్ ఇంట్లో సోదాలు
- భారీగా బంగారం, నగదు, ఆస్తులు గుర్తించిన ఏసిబి
- కిలో బంగారం, 60 లక్షల నగదు స్వాధీనం

2 లో..



## దేశ ద్రోహులకు స్థానం లేదు

- భారత్ ధర్మసత్రం కాదు
- లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్

2 లో..

## గంజాయి పార్టీపై పోలీసుల దాడి

పాతబస్తీకి చెందిన ఆయుర్వేద డాక్టర్ అరెస్ట్

2 లో..

## మహిళా సాధికారతకు మరో అడుగు

- మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ
- మహిళలను కోటీశ్వరులను చేసే పనిలో వెనకడుగు లేదు
- మహిళల స్ఫూర్తితోనే తమ ప్రజాపాలన సాగుతోంది
- కెసిఆర్ హయాంలో మంత్రి పదవులు కూడా లేవు
- బిజెపి కనీసం మహిళకు అధ్యక్ష పదవి ఇవ్వలేదు
- పరేడ్ గ్రౌండ్స్ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, నీలగిరివార్త :**
మహిళా సాధికారతకు తమ సర్కార్ మరో కీలక అడుగు వేసిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం.. మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ చేస్తున్నామని ఉద్ఘాటించారు. మహిళా శక్తి పథకం కింద 553 బస్సులు పంపిణీ చేశామని వ్యాఖ్యానించారు. మహిళలకు ఓటు హక్కు ఇచ్చింది కాంగ్రెస్ అని పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో బస్సులను సీఎం

మిగతా 2వ పేజీలో..

## కాంగ్రెస్‌కు ఊహించని షాక్

- మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ
- అఫిడవిట్‌లో వివరాలు దాచారన్న కారణంతో తిరస్కరణ
- బిజెపి అడుగడుగునా ఓట్ చోరీకి పాల్పడుతోందన్న కాంగ్రెస్
- ఈ విషయంపై న్యాయపోరాటం చేస్తున్న సిఎం రేవంత్ రెడ్డి



**భోపాల్, నీలగిరివార్త డెస్క్:**
కాంగ్రెస్ పార్టీకి అనుకోని ఘటన ఎదురయింది. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మధ్యప్రదేశ్ నుంచి ఆమె రాజ్యసభ ఎన్నికల కోసం నామినేషన్ వేయగా అది తిరస్కరణకు గురైంది. నామినేషన్ పత్రాలతో సమర్పించిన అఫిడవిట్‌లో ఒక పెండింగ్ కేసుకు సంబంధించిన వివరాలను పూర్తిగా వెల్లడించలేదనే కారణంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. నామినేషన్ల పరిశీలన సమయంలో బీజేపీ నాయకులు రిటర్నింగ్ అధికారికి అభ్యంతరం తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఒక కోర్టు కేసు వివరాలను

మిగతా 2వ పేజీలో..



## విశాఖ స్టీల్ ప్లాంట్ దుర్ఘటన బాధాకరం

- ఘటనపై ముగ్గురు నిపుణులతో కమిటీ ఏర్పాటు
- బాధితులను పరామర్శించిన డిప్యూటి సిఎం పవన్

2 లో..



## భావితరాల ఆకాంక్షలకు అనుగుణంగా...

- స్థిరమైన, పర్యావరణహిత పారిశ్రామికవృద్ధికి ప్రాధాన్యం
- పారిశ్రామికవేత్తలు రాష్ట్ర ప్రగతిలో కీలక భాగస్వాములు
- ఎఫ్ టీసీసీఐ ఎక్స్ లెన్స్ అవార్డ్స్ ప్రదానోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు

2 లో..



## గచ్చిబౌలి చోరీ కేసులో పురోగతి

- నేపాలీ దంపతులు అరెస్ట్
- భారీగా బంగారు ఆభరణాలు స్వాధీనం

2 లో..

## మంత్రి పదవికి రాజీనామా చేస్తా!

- సిఎం రేవంత్‌కు కిషన్ రెడ్డి సవాల్
- ప్రాజెక్టులకు అడ్డుపడ్డానని నిరూపిస్తావా అని ప్రశ్న
- నిరూపిస్తే మంత్రి పదవి నుంచి తప్పుకుంటానని ప్రతీన



**న్యూఢిల్లీ, నీలగిరివార్త :**
తెలంగాణ రాష్ట్రంలో ప్రాజెక్టులను తాను అడ్డుకుంటున్నానని నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమని సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం సాధించినా తెలంగాణ ప్రజల బతుకులు మాత్రం మారలేదంటూ కిషన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు తెచ్చి సోకులు చేస్తున్నారంటూ గత బీఆర్ఎస్, ప్రస్తుత రేవంత్ సర్కార్ తీరును ఆయన ఎండగట్టారు. హైదరాబాద్‌లో భూములు మిగిలే పరిస్థితి లేదన్నారు. మంత్రులతోపాటు

మిగతా 2వ పేజీలో..



### ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం

టీబీజేపీ చీఫ్ రామచందర్‌రావు విమర్శలు

2 లో..

## ప్రజల సంక్షేమం కోసమే పనిచేస్తున్నాం

- ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేసిన బిఆర్ఎస్ ప్రభుత్వం
- పేదలకు సన్నబియ్యం ఇవ్వాలని బిఆర్ఎస్ ఆలోచించలేదు
- తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొంటున్న ఘనత మాదే
- జనగామ పర్యటనలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క



**జనగామ, నీలగిరివార్త :**
ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర మంత్రివర్గం 18 గంటలు పనిచేస్తుంటే.. బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ఏదో ఒక అభాండం వేస్తున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. ధనిక రాష్ట్రాన్ని చేతిలో పెడితే అంతా ఖాళీ చేసిపోయారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలు రాష్ట్రాన్ని దోపిడీ చేశారన్నారు. పేదలకు చెందాల్సిన సొమ్మును బీఆర్ఎస్ దోచుకుందని ఆరోపించారు. మంగళవారం నాడు జిల్లాలోని చిల్పూర్ మండలం పల్లగుట్టలో పర్యటించిన భట్టి.. 33/11కెవి సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు పేదలకు సన్నబియ్యం ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. ఆర్థిక ఇబ్బందులున్నా అభివృద్ధి, సంక్షేమం ఆపడం లేదని డిప్యూటీ సీఎం వెల్లడించారు. 76 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామన్నారు. కేంద్ర ప్రభుత్వం వడ్లను ఎందుకు కొనుగోలు చేయదని ప్రశ్నించారు. కార్పోరేట్ శక్తుల దయాదక్షిణ్యాల కోసంరైతులు ఎదురు చూసేలా కేంద్రం చేస్తోందని విమర్శించారు. ఏ రాష్ట్రంలోనూ వడ్ల కొను గోళ్లు జరగడం లేదన్నారు. తాము మొక్క జొన్నలు కూడా కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. పదేళ్లు అధికారంలో ఉన్న

మిగతా 2వ పేజీలో..

## ధాన్యం కొనుగోళ్లపై కేంద్రం తిరకాసు

- కేంద్రానికి మరో లేఖ రాస్తా
- 8 లక్షల మెట్రిక్ టన్నుల మొక్క జొన్న కొనుగోలు
- హమాలీల కొరత కూడా సేకరణలో అడ్డంకి
- ధాన్యం సేకరణలో ప్రతిపక్షాల విమర్శలు అర్ధరహితం
- మీడియా సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్, నీలగిరివార్త :**
తెలంగాణలోని వడ్లకు ఇతర రాష్ట్రాల్లో డిమాండ్ లేదని పౌరసరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. అందుకే ఈ వడ్లను కేంద్రం కొనుగోలు చేయడానికి సుముఖంగా లేదన్నారు. మంగళవారం హైదరాబాద్ సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్లతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ రాష్ట్రంలో పండించిన 75 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కొనుగోలు చేయాలని మరోసారి కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి లేఖ రాస్తానని ఆయన స్పష్టం చేశారు. ఇంకా రెండు లక్షల మెట్రిక్ టన్నుల ప్రోక్యూర్‌మెంట్ వచ్చే అవకాశం ఉందన్నారు. నాగర్ కర్నూల్ జిల్లాలో ఇంకా పంట సాగవుతుందని చెప్పారు. ప్రతిపక్షాలు చెప్పేవన్నీ అబద్ధాలేనని పేర్కొన్నారు. పౌర సరఫరాల శాఖ కార్యాలయం నుంచి నేరుగా ఆన్‌లైన్‌లో రైతులు, మహిళా సంఘాల అకౌంట్‌లో నగదు వేస్తున్నామని చెప్పారు. మహిళ సంఘాలకు కేంద్ర ప్రభుత్వం నిధుల నుంచి రూ. 170 కోట్లు చెల్లించామని

మిగతా 2వ పేజీలో..

## సింగరేణి రక్షణ ప్రభుత్వానిదే

- ప్రభుత్వమే సింగరేణిని దోచుకుంటూ పోతే ఎలా
- బొగ్గు నిల్వలను మంత్రి శ్రీధర్‌బాబు చూపించాలి
- బిఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ డిమాండ్



**హైదరాబాద్, నీలగిరివార్త :**
సింగరేణి సంస్థ విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ మండిపడ్డారు. సింగరేణి సంస్థను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని ఆయన స్పష్టం చేశారు. కానీ ఆ సంస్థను ప్రభుత్వమే దోచుకుంటుందని విమర్శించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. జూన్ 5వ తేదీన 26 లక్షల 28 వేల మెట్రిక్ టన్నులు బొగ్గు ఉందని సింగరేణి అధికారులు వెల్లడించారని ఆయన వివరించారు. సింగరేణిలో బొగ్గు నిల్వలు ఉన్నాయని మంత్రి శ్రీధర్ బాబు చెబుతున్నారని పేర్కొన్నారు. బుధవారం ఉదయం 11.00 గంటలకు ఆ బొగ్గు నిల్వలను చూపించాలని మంత్రి శ్రీధర్ బాబును.. ఎమ్మెల్యే

మిగతా 2వ పేజీలో..

# హెచ్1 బి వీసాపై ట్రంప్‌కు షాక్

**లక్ష డాలర్ల ఫీజుపై కోర్టు కొట్టివేత**



**వాషింగ్టన్, నీలగిరివార్త :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు షాక్ తగిలింది. హెచ్1బీ వీసాల కోసం ట్రంప్ ప్రభుత్వం ప్రతిపాదించిన లక్ష డాలర్ల సుమారు రూ. 85 లక్షలకు పైగా భారీ ఫీజును అమెరికా ఫెడరల్ న్యాయస్థానం కొట్టేసింది. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం పూర్తిగా చట్ట విరుద్ధమని బోస్టన్‌లోని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి లియో సొరొకిన్ సోమవారం తీర్పు వెలువరించారు. విదేశాల్లో ఉంటూ అమెరికా తాత్కాలిక వలస వీసా హెచ్1బీకి ఎంపికైన వారు ఈ భారీ మొత్తాన్ని చెల్లించాలని గత సెప్టెంబరులో ట్రంప్ ప్రభుత్వం నిబంధన తీసుకురాగా.. దీనిని సవాలు చేస్తూ అమెరికాలోని 20 రాష్ట్రాల అటార్నీ జనరల్స్ బోస్టన్ కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన జడ్జి, అమెరికా కాంగ్రెస్ ఆమోదం లేకుండా అధ్యక్షుడు నేరుగా ఇలాంటి పన్నులపై నిర్ణయం తీసుకోలేరని స్పష్టం చేశారు. ఈ భారీ వసూలు పెనాల్టీ కాదని, చట్ట విరుద్ధమైన పన్ను అని ప్రకటిస్తూ ఆ నిబంధన చెల్లదని కొట్టిపారేశారు.

# మోహన్ నాయక్ ఆస్తులు వందకోట్లకు పైగానే

- ఆర్అండ్‌బీ ఈఎన్‌సీ మోహన్ నాయక్ ఇంట్లో సోదాలు
- భారీగా బంగారం, నగదు, ఆస్తులు గుర్తించిన ఎసిబి
- కిలో బంగారం, 60 లక్షల క్యాష్ స్వాధీనం



**హైదరాబాద్, నీలగిరివార్త :** ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణల నేపథ్యంలో రోడ్లు మరియు భవనాల శాఖ (ఆర్అండ్‌బీ) ఈఎన్‌సీ మోహన్ నాయక్ నివాసంతో పాటు ఆయనకు సంబంధించిన పలు ప్రాంతాల్లో అవినీతి నిరోధక శాఖ అధికారులు విస్తృత స్థాయిలో సోదాలు చేపట్టారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఉదయం నుంచి తనిఖీలు కొనసాగాయి. మోహన్ నాయక్ ఈఎన్‌సీ హోదాలో ఉన్న సమయంలో వందల కోట్ల రూపాయల విలువైన ఆస్తులను కూడబెట్టినట్లు ఆరోపణలు రావడంతో ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో హైదరాబాద్‌తో పాటు పలు ప్రాంతాల్లో మొత్తం 11 చోట్ల ఏకకాలంలో దాడులు చేపట్టారు. మియాపూర్ లోని ఓ గేటెడ్ కమ్యూనిటీలో ఉన్న విల్లా నంబర్-98లో డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఏసీబీ బృందాలు సోదాలు నిర్వహించాయి. భద్రతా కారణాల దృష్ట్యా అధికారుల అనుమతి లేకుండా ఎవరినీ లోపలికి అనుమతించలేదు. సోదాల సందర్భంగా పలు కీలక పత్రాలు, ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు, నగదు, బంగారు ఆభరణాలను అధికారులు గుర్తించినట్లు సమాచారం. ప్రాథమిక సమాచారం ప్రకారం.. రోడ్ల నిర్మాణాలకు సంబంధించిన టెండర్ల కేటాయింపుల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు మోహన్ నాయక్‌పై గతంలోనే పలు ఆరోపణలు వచ్చాయి. ముఖ్యంగా కాంట్రాక్టర్లకు టెండర్లు కేటాయించే ప్రక్రియలో అక్రమాలకు పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఏసీబీ విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. సోదాలు ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో పూర్తి స్థాయి లెక్కలు, స్వాధీనం చేసుకున్న ఆస్తుల విలువపై అధికారిక వివరాలు వెల్లడించాల్సి ఉంది. సాయంత్రం వరకు ఈ తనిఖీలు కొనసాగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. సోదాలు పూర్తయిన అనంతరం కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను ఏసీబీ వెల్లడించనున్నారు. మోహన్ నాయక్ ఇంటితోపాటు 15 ప్రాంతాల్లోని ఆయన బంధువుల నివాసాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. అతడి ఇంట్లో 20కి పైగా విదేశీ మద్యం సీసాలను గుర్తించారు. మంగళవారం ఉదయం నుంచి తనిఖీలు కొనసాగుతున్నాయని, సోదాలు పూర్తయిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని ఏసీబీ అధికారులు తెలిపారు. మోహన్ నాయక్ ఇంట్లో చేపట్టిన తనిఖీల్లో రూ.60లక్షల నగదు గుర్తించినట్లు ఏసీబీ జాయింట్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ వెల్లడించారు. కిలో బంగారు నగలు, 13 బంగారు బిస్కెట్లు గుర్తించినట్లు తెలిపారు. హైదరాబాద్, నిజామాబాద్‌లో ఇళ్ల స్థలాల పత్రాలు గుర్తించామని తెలిపారు.

# దుబాయ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

**తెలంగాణకు చెందిన ముగ్గురు కార్మికులు దుర్మరణం**

**హైదరాబాద్, నీలగిరివార్త :** దుబాయ్‌లోని అత్యంత రద్దీగా ఉండే ఎమిరేట్స్ రోడ్డుపై సోమవారం వేగంగా వస్తున్న మినీబస్సు ట్రక్కును ఢీకొనడంతో ఏడుగురు మృతి చెందగా ఐదుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను పోలీసులు హాస్పిటల్‌కు తరలించారు. మృతులను జగిత్యాల జిల్లాలోని మెట్‌పల్లి మండలానికి చెందిన అబ్దుల్ రఫీక్, కొడిమ్యాల మండలానికి చెందిన సయ్యద్ సలీం, మల్యాల మండలానికి చెందిన గజుల తిరుపతిగా గుర్తించారు. గాయపడిన వారిలో హైదరాబాద్ నగరా కి చెందిన మహమ్మద్ సయీద్ కూడా ఉన్నాడు. వీరందరూ షార్జా కేంద్రంగా పని చేస్తున్న అల్యూమినియం గ్లాస్, డోర్ ఫ్రేమ్ పరిశ్రమలో పనిచేస్తున్నారు. బస్సు డ్రైవర్ అజాగ్రత్తగా వ్యవహరించడం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు.

# విశాఖ స్టీల్ ప్లాంట్ దుర్ఘటన బాధాకరం

**బాధితులను పరామర్శించిన డిప్యూటి సిఎం పవన్**



**విశాఖపట్నం, నీలగిరివార్త :** విశాఖ ఉక్కు కర్మాగారంలో మెటల్ లిక్విడ్ లాడిల్ పేలి ఎనిమిది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. మంగళవారం విశాఖకు చేరుకున్న ఆయన, మొదట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. అనంతరం స్టీల్ ప్లాంట్ పరిధిలోని ప్రమాద స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, యాజమాన్యంతో మాట్లాడారు. ఆ తర్వాత ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఘోర ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు కోసం ముగ్గురు నిపుణులతో కూడిన ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. ఆస్పత్రిలో ఉన్న క్షతగాత్రుల వైద్య ఖర్చులన్నింటినీ ప్రభుత్వమే పూర్తిగా భరిస్తుందని స్పష్టం చేశారు. ప్రమాదంలో మరణించిన రెగ్యులర్ ఉద్యోగుల కుటుంబాలకు రూ. 1.72 కోట్లు, కాంట్రాక్ట్ కార్మికుల కుటుంబాలకు రూ. 45.75 లక్షల పరిహారంతో పాటు, మృతుల కుటుంబాలకు అదనంగా రూ. 25 లక్షల సహాయం అందజేస్తామన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం

**మీడియా సమావేశంలో బిజెపి అధ్యక్షుడు**



**భువనగిరి, నీలగిరివార్త :** తెలంగాణలో ధాన్యం కొనుగోలు వ్యవహారంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ధాన్యం దిగుబడుల అంచనాలను రూపొందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, కేంద్రానికి సరైన ఇండెంట్ పంపలేకపోయిందని ఆరోపించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేంద్రం నిర్వహించదని, రాష్ట్రాలు కొనుగోలు చేసిన ధాన్యానికి కేంద్రమే రీయింబర్స్‌మెంట్ ఇస్తుందని స్పష్టంచేశారు. దేశవ్యాప్త ధాన్యం సేకరణలో దాదాపు 50 శాతం తెలంగాణ నుంచే జరిగినప్పటికీ కేంద్రంపై తప్పుడు ప్రచారం చేస్తూ రైతులను తప్పుదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. రైతుల సమస్యలను పక్కనబెట్టి, వాస్తవాలను దాచిపెడుతూ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు.

# గంజాయి పార్టీపై పోలీసుల దాడి

**పాతబస్తీకి చెందిన ఆయుర్వేద డాక్టర్ అరెస్ట్**

**హైదరాబాద్, నీలగిరివార్త :** నగరంలోని పాతబస్తీ చంద్రాయణగుట్ట బండ్లగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి పార్టీపై పోలీసులు దాడులు చేశారు. క్రిస్టల్ టౌన్‌షిప్‌లోని ఓ ఇంటిలో గంజాయి పార్టీ జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. గంజాయి సేవిస్తున్నట్లు గుర్తించి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి సుమారు 220 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఊటీ, కొడైకెనాల్ ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకొచ్చినట్లు విచారణలో వెల్లడైంది. ఈ దాడుల్లో ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు అతౌల్లాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయన్ను వైద్య పరీక్షల నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మెడికల్ రిపోర్ట్ వచ్చిన తర్వాత తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు ప్రకటించారు.

# సింగరేణి రక్షణ ప్రభుత్వానిదే

మొదటిపేజీ తరువాయి..

గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు. 3 లక్షలకు పైగా బొగ్గు నిల్వ ఉందన్నారని ఆయన గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో తాను, మంత్రి శ్రీధర్ బాబు.. ఇద్దరమే అక్కడికి వెళ్తామన్నారు. బొగ్గు నిల్వ లేకపోతే తప్పు చేశామని ప్రభుత్వం ఒప్పుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా సింగరేణి విషయంలో జోక్యం చేసుకోలేదని గుర్తు చేశారు. సీఎంగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత సింగరేణిలో వేలు పెట్టారని స్పష్టం చేశారు. మూడు నెలల నుంచి జీతాలు ఇవ్వలేని పరిస్థితి సింగరేణిలో నెలకొందన్నారు. దీనిపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఎందుకు మాట్లాడలేదని ఆయన సూటిగా ప్రశ్నించారు. సింగరేణిలో 26 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గుపై సీబీసీఐడీతో విచారణ జరిపేలా ఆదేశించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రూ.4 వేల కోట్ల ఓవర్ డ్రాఫ్ట్ ఎందుకు తీసుకున్నారో చెప్పాలని ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. దీనిపై కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డితోపాటు బండి సంజయ్ కూడా బాధ్యత వహించాల్సి ఉందన్నారు.

# భావితరాల ఆకాంక్షలకు అనుగుణంగా అడుగులు

**ఎఫ్ టీసీసీఐ ఎక్స్ లెన్స్ అవార్డ్స్ ప్రదానోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు**



**హైదరాబాద్, నీలగిరివార్త :** భావితరాల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా తీర్చిదిద్దేలా ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. భవిష్యత్తు కోసం ఎదురు చూడకుండా, దాన్ని నిర్మించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. ఫెడరేషన్ ఆఫ్ తెలం గాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్(ఎఫ్ టీసీసీఐ) ఆధ్వర్యంలో మంగళవారం జూబ్లీహిల్స్‌లోని జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన 'ఎఫ్ టీసీసీఐ ఎక్స్‌లెన్స్ అవార్డ్స్ 2026' ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఐటీ, లైఫ్ సైన్సెస్ నుంచి మ్యానుఫ్యాక్చరింగ్, డీప్-టెక్ వరకు తెలంగాణను దేశంలోనే అత్యంత ఆకర్షణీయమైన వృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. పరిశ్రమ 4.0 విప్లవంలో భాగంగా దూసుకొస్తున్న ఆటోమేషన్, డీప్-టెక్ సవాళ్లను ఎదుర్కొనేలా రాష్ట్రంలో కాంప్రహెన్సివ్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. అదే సమయంలో... భవిష్యత్తు తరాలకు మేలు జరిగేలా స్థిరమైన, పర్యావరణహిత పారిశ్రామిక వృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు.

# తెలంగాణ మహిళలను మభ్య పెడుతున్న సిఎం

మొదటిపేజీ తరువాయి..

పెంచారు. వారు వర్కర్లు కాదని, టీచర్లని పేర్కొంటూ హోదాను ఉన్నతీకరించారు. 2014 నాటికి అంగన్‌వాడీ టీచర్లకు కేవలం రూ.4,200, వారి సహాయ కులకు రూ.2,200 వేతనం లభించేది. కానీ, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక అంగన్‌వాడీ టీచర్ల జీతాన్ని రూ.13,650 కు, మినీ అంగన్‌వాడీ టీచర్ల జీతాన్ని రూ.7,800కు, అంగన్‌వాడీ హెల్పర్ల వేతనాన్ని రూ.7,800కు పెంచి దేశం లోనే అత్యధికంగా చెల్లించారు. అభయ హస్తం పేరిట ఇచ్చిన ఎన్నికల మేనిఫెస్టోలో అంగన్‌వాడీ టీచర్ల వేతనాన్ని రూ.18 వేలకు పెంచుతామని, ఈపీఎఫ్ పరిధిలోకి తీసుకువచ్చి ఉద్యోగ భద్రత కల్పిస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. మాయమాటలు చెప్పి రెండున్నరేళ్లు గడుస్తున్నా ఇచ్చిన హామీకి అతీగతీ లేదు. ఎన్నికలకు ముందు అరచేతిలో వైకుంఠం చూపించి, అధికారంలోకి వచ్చాక అబద్ధాల ప్రచారం చేస్తున్నట్లు కాంగ్రెస్ వైఖరి ఉంది. సమస్యల పరిష్కారం కోసం 'ఛలో సెక్రటేరియట్' పిలుపునిచ్చిన అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం కర్కశంగా వ్యవహరించింది. అంగన్‌వాడీలపై పోలీసులను ప్రయోగించి దుర్మార్గమైన చరిత్రను కాంగ్రెస్ మూటకట్టుకుంది. ఇప్పటికైనా కళ్లు తెరవండి. మీ పాలనను అన్ని వర్గాల ప్రజలు ఛీ కొడుతున్నారన్న విషయాన్ని గుర్తించండి. పెండింగ్‌లో ఉన్న అంగన్‌వాడీ, మినీ అంగన్‌వాడీల వేతనాలను తక్షణమే చెల్లించాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం' అంటూ పోస్టు పెట్టారు.

# భోజన బాధలు!

మొదటిపేజీ తరువాయి..

ఆర్థిక పరిస్థితి దెబ్బతింటోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1 కోటి 5 లక్షల 42 వేల 188 బీపీఎల్ రేషన్ కార్డులు ఉన్నాయని, వాటి పరిధిలో 3 కోట్ల 39 లక్షల 96 వేల 239 మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రతి వ్యక్తికి ఆరు కిలోల బియ్యం మాత్రమే అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల ఆహార భద్రతను బలోపేతం చేయాలంటే బియ్యంతోపాటు పప్పులు, వంట నూనెలు, మొక్కజొన్నలు, చక్కెర, కారం, పసుపు, జీలకర్ర, పామాయిల్, కొబ్బరి నూనె, ఆవాలు, జొన్నలు, పల్లీలు, సబ్బులు వంటి మొత్తం 14 రకాల నిత్యావసర సరుకులను రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేయాల్సిన అవసరం ఉందని ఆమె సూచించారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం వల్ల అనేక కుటుంబాలు పోషకాహారాన్ని తీసుకోలేకపోతున్నాయని, ముఖ్యంగా మహిళల్లో రక్తహీనత సమస్య అధికమవుతోందని మల్లు లక్ష్మి ఆందోళన వ్యక్తం చేశారు. సరైన పోషకాహారం అందక చిన్నారులు కూడా ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఆహార భద్రతా చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రేషన్ దుకాణాల ద్వారా 14 రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేసేలా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఐద్వా డిమాండ్ చేసింది.

# మహిళా సాధికారతకు మరో అడుగు

మొదటిపేజీ తరువాయి..

ప్రారంభించి ప్రసంగించారు. దేశానికి తొలి మహిళా రాష్ట్రపతిని అందించింది కాంగ్రెస్సేనని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. బీజేపీ అధ్యక్ష పదవిని ఒక్కసారైనా మహిళకు ఇచ్చారా అని ప్రశ్నించారు. మహిళలను స్ఫూర్తిగా తీసుకుని పరిపాలన చేస్తున్నామని వివరించారు. మహిళలనుపరిపాలనలో భాగస్వామ్యం చేస్తామని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలోని తొలి ఐదేళ్లలో ఒక్క మహిళకైనా మంత్రి పదవి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. తమ ప్రభుత్వంలో ఇద్దరు మహిళలకు మంత్రి పదవులు ఇచ్చామని ప్రస్తావించారు. మహిళలను స్ఫూర్తిగా తీసుకుని పరిపాలన చేస్తున్నామని వివరించారు. కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులుగా మారుస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు.

# ధాన్యం కొనుగోళ్లపై కేంద్రం తిరకాసు

మొదటిపేజీ తరువాయి..

వివరించారు. 8 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కూడా కొనుగోలు చేశామని తెలిపారు. క్వింటాకు రూ.1000 నష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించిందన్నారు. దేశంలో ఏరాష్ట్రం కూడా ఇంత బాధ్యతగా కొనుగోలు చేయలేదని చెప్పారు. భవిషత్తులో పాడి ప్రోక్యూర్‌మెంట్‌లో ఏ విధంగా పోవాలని దేశంలో వివిధ రాష్ట్రాల్లో ప్రత్యేక బృందాలు పర్యటిస్తున్నాయని వివరించారు. రాష్ట్రంలో హమాలీల సమస్య అధికంగా ఉందన్నారు. తెలంగాణలో ప్రస్తుతం ఉన్న స్టోరేజ్ సరిపోవడం లేదన్నారు. బుధవారం మేడిగడ్డలో మూడు బ్యారేజీల టెస్టింగ్ ప్రక్రియపై సమీక్ష చేస్తామని చెప్పారు. ఈ మూడు బ్యారేజిల్లో నీళ్లు నింపొద్దని ఇప్పటికే నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఎన్‌డీఎస్ఏ చెప్పిందని గుర్తు చేశారు. మేడిగడ్డలో నీళ్లు నింపితే కొట్టకుపోతాయని ఎన్‌డీఎస్ఏ స్పష్టం చేసిందన్నారు. దేశంలోనే రికార్డ్ స్థాయిలో తెలంగాణలో ధాన్యం కొనుగోళ్లు చేశామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా తెంగాణలో ఎక్కువ ధాన్యం ఉత్పత్తి అయ్యిందని..యాసంగిలో రికార్డ్ స్థాయిలో ధాన్యం కొన్నామని చెప్పారు. రబీ, ఖరీఫ్ సీజన్ కలిపి 147 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని.. ఇన్ని టన్నుల ధాన్యం సేకరణ దేశంలోనే రికార్డ్ అని తెలిపారు. వడ్ల కొనుగోళ్లకు సంబంధించి రూ.35,077 కోట్లు రైతుల ఖాతాలో వేశామన్నారు. 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం 52 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ టార్గెట్ పెట్టిందని.. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 75 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించిందని తెలి పారు. తెలంగాణ పొరుగు రాష్ట్రం ఏపీలో 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు మాత్రమే జరిగిందని పేర్కొన్నారు.

# దేశ ద్రోహులకు స్థానం లేదు

**యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్**



**లక్నో, నీలగిరివార్త డెస్క్ :** దేశ సంస్కృతి, సంప్రదాయాల పట్ల విశ్వాసం లేని వారికి భారతదేశం ఎంతమాత్రం ధర్మశాల కాదని ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అన్నారు. లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. లఖ్‌నవూలో మంగళవారంనాడు జరిగిన శ్రీరామకథా మహోత్సవం ముగింపు వేడుకలో ఆయన మాట్లాడుతూ, శ్రీరాముని ఆదర్శాలు యావద్దేశాన్ని ఏకం చేస్తున్నాయని చెప్పారు. 'భారతదేశం ఎంతమాత్రం ధర్మశాల కాదు. దేశ సంస్కృతి, వారసత్వం, విలువలను గౌరవించే వాళ్లు మాత్రమే ఇక్కడ గౌరవప్రదంగా జీవించవచ్చు. భారతదేశ స్ఫూర్తి, సంప్రదాయాలను అంగీకరించని వాళ్లకి ఇక్కడ స్థానం లేదు' అని యోగి ఆదిత్యనాథ్ అన్నారు. రామాయణ కాలానికి, నవీన భారతానికి మధ్య సారూప్యాన్ని వివరిస్తూ, దుష్టశక్తులు అధికారంలో ఉన్నప్పుడల్లా రాక్షసరాజు రావణాసురిడి కాలంలో ఏవిధంగా దుష్టశిక్షణ జరిగిందో అదే పునరావృత మవుతుందని అన్నారు. దేశంలోని జనాభా మార్పు కోసం జరుగుతున్న కుట్రలో భాగమే 'లవ్ జిహాద్' అని యోగి పేర్కొన్నారు.

# కాంగ్రెస్‌కు ఊహించని షాక్

మొదటిపేజీ తరువాయి..

మీనాక్షి నటరాజన్ తన అఫిడవిట్‌లో పేర్కొనలేదని బీజేపీ ఆరోపించింది. ఈ అభ్యంతరాన్ని పరిశీలించిన అనంతరం నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. మీనాక్షి నటరాజన్ గతంలో లోక్‌సభ సభ్యురాలిగా పనిచేశారు. ప్రస్తుతం కాంగ్రెస్‌లో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మధ్యప్రదేశ్‌లో రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే ఉద్రిక్తతలు నెలకొన్నాయి. కాంగ్రెస్ తమ ఎమ్మెల్యేలను కర్ణాటకకు తరలించి క్రాస్ ఓటింగ్‌ను అడ్డుకునే ప్రయత్నాలు చేస్తోంది. ఇక, మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ నిర్ణయాన్ని కాంగ్రెస్ సవాలు చేస్తుందా? లేదా ప్రత్యామ్నాయ వ్యూహంతో ముందుకు వెళ్తుందా? అన్నది ఆసక్తికరంగా మారింది. ఇదిలావుంటే మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను మధ్యప్రదేశ్ ఎన్నికల అధికారి తిరస్కరించడంపై ఆ పార్టీ స్పందించింది. బుధవారం కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తన ఎక్స్ ఖాతా వేదికగా స్పందించారు. ఇది కాంగ్రెస్ పార్టీకి దక్కాల్సిన స్థానాన్ని లాక్కోవడానికి చేసిన నిరాశాజనకమైన ప్రయత్నం మాత్రమేనని స్పష్టం చేశారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నామినేషన్ తిరస్కరణను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. నామినేషన్‌ను తిరస్కరించడం బీజేపీ కుట్ర అని ఆరోపించారు.


# మంత్రి పదవికి రాజీనామా చేస్తా!

మొదటిపేజీ తరువాయి..

అందరూ భూ దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం కుదేలయ్యిందని చెప్పారు. ఉద్యోగులకు వేతనాలు ఇచ్చే పరిస్థితి ప్రభుత్వానికి లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి బెదిరింపులకు తాను భయపడే వ్యక్తిని కానన్నారు. సీఎం రేవంత్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సీఎం స్థాయిని మరిచి మాట్లాడుతున్నారంటూ రేవంత్‌రెడ్డిపై కిషన్ రెడ్డి నిప్పులు చెరిగారు. సీఎం రేవంత్ రెడ్డిలాగా తాను మాటకారిని కాను.. కానీ మాటపై నిలబడే వ్యక్తిని అని కిషన్ రెడ్డి కుండబద్దలు కొట్టారు. పదవులు, అధికారం కోసం మాటలు మార్చే వ్యక్తిని తాను కానని స్పష్టం చేశారు. చిల్లర రాజకీయాలు చేయడం తనకు అలవాటు లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై ఎక్కడైనా తాను చర్చకు సిద్ధమని కిషన్‌రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. బీజేపీ నేతలను సీఎం రేవంత్ రెడ్డి బెదిరిస్తున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను గమనించాలంటూ తెలంగాణ సమాజానికి ఈ సందర్భంగా సూచించారు. సీఎం రేవంత్‌కు తాము గులాంలం కామన్నారు. తనకు సీఎం రేవంత్‌రెడ్డి సర్టిఫికెట్ అవసరం లేదని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

# ప్రజల సంక్షేమం కోసమే పనిచేస్తున్నాం

మొదటిపేజీ తరువాయి..



బీఆర్ఎస్ పార్టీ ఉచిత విద్యుత్ ఇచ్చింది కానీ డిస్కమ్‌లకు డబ్బులు చెల్లించలేదన్నారు. కానీ ఇప్పుడు డిస్కమ్‌లకు డబ్బులు చెల్లిస్తున్నామని అన్నారు. ఎన్నికల సందర్భంగా నేను, సీఎం ఇక్కడి ప్రజలకు హామీలు ఇచ్చాం. ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం' అని భట్టి తెలిపారు. దేవాదుల ప్రాజెక్టును బీఆర్ఎస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని వ్యాఖ్యానించారు. దేవాదుల ప్రాజెక్టు పనులు త్వరలోనే పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. రైతులకు రుణమాఫీ చేయడంతో పాటు.. తడిసిన ధాన్యాన్ని కూడా కొంటున్నామన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం ఒకప్పుడు వలసల ప్రాంతమని.. కానీ ఇప్పుడు అభివృద్ధి జరుగుతోందన్నారు. రఘునాథపల్లిలో 230×ªV సబ్ స్టేషన్ ఏర్పాటును పరిశీలిస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. తడిచిన ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. 72 లక్షల టన్నుల ధాన్యం సేకరించి రూ.14వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశాం. రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని కేంద్రం ఎందుకు కొనుగోలు చేయట్లేదు? రాష్ట్రం సేకరించిన మొక్కజొన్నను కూడా కేంద్రం కొనుగోలు చేయాలి. 53 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు రూ.5వేల కోట్లు చెల్లిస్తున్నాం. ప్రజలకు నాణ్యమైనవిద్యుత్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. గతంలో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం. దేవాదుల ప్రాజెక్టును గత ప్రభుత్వం గాలికొదిలేసింది. దేవాదులకు నిధులు మంజూరుతో పనులు వేగంగా సాగుతున్నందున ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేస్తాం. రైతులకు రూ.22వేల కోట్ల రుణమాఫీ చేశాం అని వివరించారు.

printed, Published and Owned by GUNTOJU VISHNU MURTHY, Printed at V.M. PRINTERS Plot No : 08, Shiva shankar colony, Kuntloor( vil), Abdulpurmet(mdl), Rangareddy(dist). Telangana. Published at V.M.PUBLICATIONS Plot No : 108, Shiva shankar colony, Kuntloor( vil), Abdulpurmet(mdl),Telangana State. Pin : 501505, Editor : GUNTOJU VISHNU MURTHY, RNI No : APTEL/31957/2009. Cell No : 96765 49223.

# పాలిటెక్నిక్ ఫలితాల్లో దేవరకొండ పీఎంశ్రీ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థుల ఘనవిజయం

**ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో సీట్లు సాధించిన నలుగురు విద్యార్థులు**

**కృతజ్ఞతలు తెలిపిన ప్రధానోపాధ్యాయులు చెరిపెల్లి శ్రీనివాసులు**

**దేవరకొండ నీలగిరి వార్త**

దేవరకొండ పట్టణంలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్షలో అద్భుత ప్రతిభ కనబరిచి, ప్రముఖ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో సీట్లు సాధించారు. పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించడమే కాకుండా, వేసవి సెలవుల్లోనూ ఎంతో శ్రమించి ఈ ఘనత సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెరిపెల్లి శ్రీనివాసులు మరియు ఉపాధ్యాయ బృందం ఘనంగా అభినందించారు.

**ప్రత్యేక శిక్షణకు దక్కిన ఫలితం:**

పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్షలో రాణించేందుకు వేసవి సెలవుల్లో ప్రత్యేకంగా 'జూమ్ క్లాసులు' నిర్వహించారు. విద్యార్థులకు ఎంతో ఓపికతో ప్రత్యేక శిక్షణను అందజేసి, వారు ఉత్తమ ర్యాంకులు సాధించేలా కృషి చేసిన పాఠశాల గణిత ఉపాధ్యాయులు కొలనుపాక శ్రీపతిరావు సేవలను ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ప్రత్యేకంగా కొనియాడారు. ఉపాధ్యాయుల నిరంతర పర్యవేక్షణ, విద్యార్థుల కఠిన శ్రమ వల్లే ప్రభుత్వ కళాశాలల్లో సీట్లు దక్కాయని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

**సీట్లు సాధించిన ప్రతిభావంతులు:**



**గంటల శివ,డి. బాలు,రాఘవేంద్ర, ఇస్లావత్ రాహుల్.**

హాజరైన ఉపాధ్యాయ బృందం: పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ అభినందన కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీమతి హెప్సిబా మేడం, ఏజే. వినయ్ కుమార్, కే. సంతోష్ రెడ్డి, కే. సైదులు, కే. అంజయ్య, ఆర్. హేమ్ల నాయక్, ఎం. కళ్యాణి, ఎన్. కొండయ్య తదితరులు పాల్గొని విద్యార్థులకు మిఠాయిలు తినిపించి, వారి భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు.

# గ్రామపంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం

**నిరుపేద పూరిగుడిసెపై తాగునీటి ట్యాంకు నీళ్లు పారుతున్న వైనం**

**మునగాల ప్రతినిధి నీలగిరి వార్త:,జూన్9**

మునగాల:గ్రామపంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంతో, నిరుపేదకుటుంబానికి చెందిన పూరి గుడిసె పై నిత్యంతాగునీటి ట్యాంకు నీళ్లు పడుతూ ఇల్లు మొత్తం బురద మయంగా మారుతు, ఇంట్లో కుటుంబ సభ్యులు నివసించలేని దయనీయ పరిస్థితి మండల పరిధిలోని కలకోవ గ్రామంలో వెంగళం విశ్వనాథచారి నివాసంలో నెలకొని ఉంది, మంగళవారంబాధితులు వెంగళం విశ్వనాథ చారి దంపతుల తెలిపిన వివరాల ప్రకారం, కలకోవా గ్రామంలోని స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం పక్కనే తన సొంత భూమిలో తాను ఏర్పాటు చేసుకున్న పూరి గుడిసె పక్కన గ్రామ పంచాయతీకి చెందిన మంచినీటి ట్యాంకు ఉన్నదని, ప్రతిరోజు గ్రామ ప్రజల తాగునీటి అవసరాల కోసం ఇట్టి మంచినీటి ట్యాంకును నీటితో నింపేసందర్భంలో గ్రామానికి చెందినగ్రామపంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం మూలంగా రోజు ఉదయం సాయంత్రం ట్యాంకు పూర్తిగా నిండిపోయి, నీళ్లు పొంగిపొర్లుతూ గంటలసేపు నీరు వృధాగా ట్యాంకు పైనుండి తమగుడిసె పై మరియు తమ ఇంటి ఆవరణలో పడుతూ తాము ఇంటిలో ఉండలేని పరిస్థితి దాపురించిందని తద్వారా తమ ఇంటి పరిసరాలు బురదమయంగా తయారై తాము ఇంటిలో ఉండలేని పరిస్థితి నెలకొంటుందని వెంగళం విశ్వనాథం దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు, తమకు జీవనాధారంగా ఉన్న మేకల పెంపకానికి సైతం తాగునీటి ట్యాంకు నుండి వచ్చే వృధా జలాల బురదతో ఇంటిలో మేకలను సైతం పెంచుకునే పరిస్థితి లేకుండా పోయిందని, ఎన్నిసార్లు గ్రామపంచాయతీ కార్యదర్శి మరియు పాలకవర్గం దృష్టికి తమ సమస్యను తీసుకుపోయినప్పటికీ తమ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడం లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ





ఇంటి పక్కనే ఉన్న మంచినీటి ట్యాంకు వృధా జలాలు తమ ఇంటిపై పడి తమ ఇంటి పరిసరాలు వరదమయంగా కాకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.చర్యలు తీసుకుంటాం పంచాయతీ కార్యదర్శికలకోవ గ్రామానికి చెందిన వెంగళం విశ్వనాథం ఇంటిపై పడుతున్న తాగునీటి ట్యాంకు వృధా జలాల విషయమై , గ్రామపంచాయతీ కార్యదర్శి కిన్నెర వీరబాబు ను వివరణ కోరగా, తాను గత రెండు రోజుల క్రితమే నూతనంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి గా బాధ్యతలు స్వీకరించానని, తాగునీటి వృధా జలాల సమస్య విషయంవెంగళం విశ్వనాథం కుటుంబ సభ్యుల ద్వారా తన దృష్టికి వచ్చిందని గ్రామ సర్పంచ్ మండవ వెంకటాద్రి తో ఇట్టి విషయమై చర్చించానని త్వరలో ఇట్టి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేటట్లు చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు.

# ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకోవాలి

**గడ్డిపల్లి సస్య కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డి ఆదర్శ్**

**వానాకాలం రైతులు నీటి వనరు ఆధారంగా మాత్రమే వరి పంటలు సాగుచేయాలి మండల వ్యవసాయఅధికారి బుంగ రాజు**

**మునగాల ప్రతినిధి నీలగిరివార్త: జూన్ 09**

మునగాల:ప్రతి రైతు తన భూసార పరీక్షలు చేయించుకొని, భూమికిఅవసరమైన పోషకాలను, ఎరువులను మాత్రమే వాడాలని కృషి విజ్ఞానకేంద్రం గడ్డిపల్లి సస్య రక్షణ శాస్త్రవేత్త డి.ఆదర్శ తెలిపారు.మునగాల మండలంలోని నరసింహపురం గ్రామంలో,గ్రామసర్పంచ్ డాక్టర్ వేమూరి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రైతులకు వ్యవసాయశాఖ తరపున నేల సంరక్షణ,నేలఆరోగ్యం పై అవగాహనకల్పించారు. కే.వి.కే గడ్డిపల్లి సస్య రక్షణ శాస్త్రవేత్త మంగళవారం నాడు ఖేత్ బచావో అభియాన్ (నేలలను రక్షించు కుందాం) పై అవగాహన కల్పించటం జరిగింది. ఈకార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం గడ్డిపల్లి సస్య రక్షణ శాస్త్రవేత్త డి.ఆదర్శ మాట్లాడుతూ, భూసారాన్ని కాపాడటానికి, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సహజ వ్యవసాయాన్ని చేయాలన్నారు.భూసార పరీక్షకు మట్టినమూనా సేకరించే విధానం పై అవగాహన కల్పించారు. అధికంగా రసాయన ఎరువులు వాడటం వల్ల భూసారం తగ్గిపోతోందని, వీటి వాడకాన్ని తగ్గించి, సేంద్రీయ మరియు సహజ వ్యవసాయ పద్ధతులను అవలంబించేలా రైతులకు అవగాహన కల్పించారు.దీని ద్వారా సాగు ఖర్చులు తగ్గుతాయి అని తెలియజేశారు.వాతావరణ మార్పులను తట్టుకుంటూ, ఎక్కువ దిగుబడి సాధించే ఆధునిక ,పర్యావరణహిత వ్యవసాయ పద్ధతులపై శిక్షణ ఇచ్చారు,అలాగే రైతులు నానో ఎరువుల వాడకాన్ని అలవాటు చేసుకోవాలని తెలిపారు. మండల వ్యవసాయఅధికారి బుంగ రాజు మాట్లాడుతూ, ఈ వానకాలం రైతులు నీటి వనరు ఆధారంగా మాత్రమే వరి పంట సాగు చేయాలని తెలియజేశారు. నీటి లభ్యత తక్కువగా





ఉన్న దగ్గర ఆరు తడి పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో గ్రామసర్పంచ్ డాక్టర్ వేమూరి సత్యనారాయణ, పంచాయతీకార్యదర్శి గండ్ర బాలరాజు,రైతులు బారి లక్ష్మయ్య, వీరబోయిన వెంకన్న, వీరబోయిన వినోద్, బొమ్మ పెద్ద వెంకన్న, కేసగాని వెంకన్న, కారింగుల సైదులు, వీరబోయిన శ్రీను, బారి బొబ్బయ్య, బొమ్మ వెంకటేశ్వర్లు,రేవూరి బాబు,నారయ్య,వెంకన్న , కొమ్ములయ్య,చుక్కయ్య, నర్సింహారావు,వీరాస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం :సర్పంచ్ దున్నా శ్రీనివాస్.

**నడిగూడెం నీలగిరి వార్త ప్రతినిధి :**

తెలంగాణలో రాష్ట్రంలో మహిళలు ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని సర్పంచ్ దున్నా శ్రీనివాస్ అన్నారు.మంగళవారం నడిగూడెం మండల కేంద్రం నుండి హైదరాబాదు పరేడు గ్రౌండ్ లో జరిగే సీఎం సభకు మహిళా సమైక్య సభ్యులతో బయలు దేరుతున్న బస్సును ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా సమాఖ్య సభ్యులకు రాష్ట్రంలో 533 బస్సులను పంపిణీ చేస్తుందని అన్నారు. మహిళా సంఘాలకు పెట్రోల్ బంకులను కేటాయించడం ద్వారా వారిని వ్యాపారంగలో రాణించాలని మహిళలను శక్తిమంతులుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ఒక మహిళగా నియోజకవర్గంలో మహిళల సమస్యల పట్ల వెంటనే స్పందిస్తూ వారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని తెలిపారు. సభకు తరలిన వారిలో ఏపీఎం దుర్గాప్రసాద్, సీ సీ శ్రీనివాసరావు,వివోలు,మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.



# మద్దిరాలలో ప్రమాదవశాత్తు గీత కార్మికుడు మృతి

**మద్దిరాల నీలగిరి వార్త జూన్ 10**

సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం మద్దిరాల మండలంలో గీత గీత కార్మికుడు మృతి చెందడం జరిగినది వివరాలలోకి వెళితే మద్దిరాల గ్రామానికి చెందిన చామకూరి వెంకన్న తండ్రి (లేట్) బిక్షం వయస్సు 51 సంవత్సరాలు ప్రతిరోజు మాదిరిగానే మంగళవారం ఉదయం 7 గంటల 30 నిమిషాల కు మద్దిరాల శివారులో గల మట్టి పెల్లి లింగయ్య వ్యవసాయ భూమిలో తాటి చెట్టు ఎక్కి తాటికల్లు గీస్తుండగా ప్రమాదవశాస్తూ మోకుజారి నడుము కింది భాగానికి రాగా తాటి చెట్టు మీదనే తలక్రిందులుగా వేలాడబడి ఊపిరాడక తాటి చెట్టు మీదనే మరణించాడు మృతునికి ఇద్దరు కుమారులు ఒక కూతురు సంతానం కలదు మృతుని భార్య చామకూరి లింగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టర్ చేయించి కుటుంబ సభ్యులకు అప్పజెప్పడం జరిగినదని స్థానిక ఎస్సై వీరన్న తెలిపారు



# విద్యార్థులకు మత్తు పదార్థాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవు ఎస్సై వీరన్న

**మద్దిరాల నీలగిరి వార్త జూన్ 10**

సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం మద్దిరాల మండలంలో విద్యార్థులకు మత్తు పదార్థాలు అమ్మినచో కఠిన చర్యలు తప్పవని ఎస్సై వీరన్న హెచ్చరించారు త్వరలో పాఠశాలలు ప్రారంభం అవుతున్న సందర్భంగా మంగళవారం దుకాణదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు పాఠశాలలు ఉన్న ప్రాంతాలలో పొగాకు సంబంధ ఉత్పత్తులు మత్తుపదార్థాలు అమ్మకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ ఆదేశాల మేరకు మద్దిరాల మండల కేంద్రంలో మరియు ఇతర ప్రాంతాలలో పాఠశాల లు ఉన్న ప్రాంతంలో దుకాణాలలో నేరేడుచర్ల పోలీసులు తనిఖీలు నిర్వహించడం జరిగినది ఈ తనిఖీలలో భాగంగా షాపు నిర్వాహకులకు అవగాహన కల్పించారు పాఠశాల ల ప్రాంతాలలో పొగ ఉత్పత్తులు అమ్మ వద్దని విద్యార్థులకు ఎలాంటి మత్తు పదార్థాలు అమ్మకూడదని వారికి సూచనలు ఇవ్వడం జరిగినది ఒకవేళ ఎవరైనా దుకాణదారులు మత్తు పదార్థాలు అమ్మినట్లయితే వారిపై చట్టపరమైన కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.




# కాంచాని బాగమ్మ కు నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

**మునగాల ప్రతినిధి నీలగిరి వార్త:, జూన్ 09**

మునగాల:మండలకేంద్రంలోని న్యూ ప్రజ్ఞ హైస్కూల్ కరస్పాండెంట్ కాంచాని కృష్ణమూర్తి మాతృమూర్తి కంచాని బాగమ్మ సోమవారం రాత్రి అనారోగ్యంతో మరణించారని తెలిసి,మంగళవారంఆమె స్వగ్రామమైన తుంగతుర్తి నియోజకవర్గం, శాలిగౌరారం మండలం,ఇటుకలపాడు గ్రామంలో మృతురాలు కాంచని భాగమ్మ మృతదేహాన్ని కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ సందర్శించి, ఆమెమృతదేహానికిపూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని వ్యక్తం చేశారు,



# గంజాయి నిర్మూల లక్ష్యంగా నార్కోటిక్ డాగ్ 'రోలెక్స్' తనిఖీలు..

**ఏ.ఎస్సై. రత్నం**

**మునగాల ప్రతినిధి నీలగిరివార్త: జూన్ 09**

మునగాల:జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్, ఆదేశాల మేరకు డాగ్స్ స్క్వాడ్ సిబ్బంది ఈరోజు మునగాల మండలకేంద్రంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు, అని ఏఎస్సై రత్నం తెలిపారు. గంజాయి లాంటి మాదకద్రవ్యాల నిర్మూలన గుర్తింపు లక్ష్యంగా నార్కోటిక్ డాగ్ రోలెక్స్ తో పట్టణ కేంద్రంలో హోటల్స్, టీ దుకాణాలు,మెడికల్ దుకాణాలు, కూరగాయల దుకాణాలు, బహిరంగ ప్రదేశాలలో తనిఖీలు, సోదాలు నిర్వహించామనివారు అన్నారు. ప్రస్తుత సమాజంలో గాంజాయి లాంటి మాదకద్రవ్యం మన యువతని సమాజాన్ని పట్టిపీడిస్తుందని దీనిని తరిమికొట్టాల్సిన బాధ్యత అందరిపై ఉండాలని అన్నారు. దీనిలో భాగంగానే విస్తృత తనిఖీలు నిర్వహించామని. డ్రగ్స్ కు సంబంధించిన సమాచారం పోలీసు వారికి ఇవ్వాలని సూచించారు. ఎవరైనా గంజాయి ఉపయోగించేవారు ఉన్నా, సరఫరా చేసేవారు ఉన్నా అలాంటి వారి సమాచారం పోలీసులకు తెలియజేయాలని కోరారు.




# అభివృద్ధి, అవినీతిపై బహిరంగ చర్చకు సిద్ధం

**మాజీ ఎమ్మెల్యే ఆరోపణలు అవాస్తవం**

**ఆరోపణలు రుజువు చేస్తే రాజకీయ సన్యాసం చేస్తాం**

**మాజీ ఎమ్మెల్యే వ్యాఖ్యలను ఖండించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు..**

**పిసిసి డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి.**

**జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు.**

**మునగాల ప్రతినిధి నీలగిరివార్త: జూన్ 09**

మునగాల:కోదాడ నియోజకవర్గంలో అవినీతి జరుగుతుందంటూ మాజీ ఎమ్మెల్యే బొల్లం చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పిసిసి డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం కోదాడ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు,మాజీ సర్పంచ్ పారా సీతయ్యలతో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే బొల్లం పరిపాలనలో ప్రజలు ఎన్ని ఇబ్బందులు పడ్డారో నియోజకవర్గ ప్రజలు అందరికీ తెలుసునన్నారు. గంజాయి,ఇసుక,మట్టికి గుడిబండ షాడో ఎమ్మెల్యే తో టోకెన్లు పెట్టించి మరి ప్రజల నుంచి అక్రమంగా వసూలు చేసిన సంగతి నిజం కాద అని ప్రశ్నించారు. ఆఖరికి దళిత బంధు పేరుతో దళితులను మోసం చేసిన నువ్వు నీతులు మాట్లాడడం సరికాదన్నారు. వేల కోట్ల నిధులు తీసుకువస్తూ ఎక్కడ కూడా అవినీతికి ఆస్కారం లేకుండా రెండు నియోజకవర్గాల అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తున్న తమ నాయకులు మంత్రి



ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి లపై మరొకసారి నిరాధారమైన ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతలపాటి శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ షేక్ బషీర్,ఎడవల్లి బాల్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు కందుల కోటేశ్వరరావు, తూనం కృష్ణ, ఎలమందల నరసయ్య, పాశం శ్రీను, సైది బాబు, పిల్లుట్ల శ్రీను, బాగ్దాద్, పిడతల శ్రీను,గంధం యాదగిరి, చింతా బాబు, పాలూరి సత్యనారాయణ, ఉప్పగండ్ల శ్రీను,శోభన్, తదితరులు పాల్గొన్నారు.

# పిడుగుపాటుతో భారీ నష్టం. తప్పిన ప్రాణాపాయం.

**కమాన్ పూంనీలగిరివార్త::జూన్ 9.**

కమాన్ పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని బాపూజీ నగర్ లో సోమవారం రాత్రి పిడుగుపాటుతో ఇల్లు ముందటి వేసిన రేకులు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. ఇంట్లో ఎటువంటి గాయాలు కానీ ప్రాణాలు నష్టం కానీ జరగలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. సోమవారం రాత్రి మెరుపులతో పాటు ఉరుములు వర్షం రావడం జరిగింది. అదే సమయంలో బాపూజీ నగర్ లోని సాయి బాబా మందిరం పక్కన గల ఆర్.ఎం.పి డాక్టర్ రాచకొండ శ్రీనివాస్ ఇంటి ముందరగల రేకుల షెడ్డు పై ఒకేసారి పిడుగు పడటంతో రేకుల పూర్తిగా ధ్వంసం అయ్యి కింద పడిపోయాయి. రేకుల షెడ్డు కింద ఉన్న రెండు ద్విచక్ర వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి అలాగే రెండు కూలర్లు పూర్తిగా పగిలిపోయాయి. సుమారు రెండు లక్షల ఆస్తి నష్టం వాటిల్లి నట్లు బాధితుడు రాచకొండ శ్రీనివాస్ తెలిపారు. సంఘటన స్థలానికి తహసిల్దార్ ముస్త్యాల వాసంతి, ఎంపీడీవో సాదినేని ప్రియాంక ఆర్ ఐ స్రవంతిలు వెళ్లి పరిశీలించారు.తనకు నష్టపరిహారం ప్రభుత్వపరంగా ఇప్పించాలని స్థానిక తహసిల్దార్ ముస్త్యాల వాసంతి, ఎంపీడీవో సాదినేని ప్రియాంకలను కోరారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపించడం జరుగుతుందని అధికారులు పేర్కొన్నారు.



# కాంగ్రెస్ కుట్రలను ఓడిద్దాం.. సింగరేణిని కాపాడుకుందాం...

**137 ఏండ్ల చరిత్రలో ఎన్నడూ లేనివిదంగా కొత్తగా నిబంధనలు.**

**కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి సంస్థను ఏటీఎంలా వాడుకుంటున్నారు.**

**రేవంత్ రెడ్డి చుట్టాలకు అధిక రేట్లకు కాంట్రాక్టు పనులు**

**12వ తేదీన హరీష్ రావు సభను విజయవంతం చేద్దాం.**

**మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి...**

**జయశంకర్ భూపాలపల్లి.జూన్ 9,**

**నీలగిరివార్త:**

సింగరేణి కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వంలో జరుగుతున్న అన్యాయాలను కుట్రలను ఓడిద్దాం.. సింగరేణిని కాపాడుకుందాం కార్మిక లోకం ఏకం కావాలి అంటూ మంగళవారం జయశంకర్ భూపాలపల్లి సింగరేణి ఏరియా కెటికె -1 ఇంక్లైన్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర మాటాడుతూ....కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుట్రలకు బానిసలు అవుదామా లేదా వారి అక్రమాలపై తిరగబడదామ నిర్ణయం మీ చేతుల్లోనే ఉంది. కొంతమంది మమ్మల్ని అంటున్నారు మీరు గుర్తింపు సంఘం నాయకులుకారు మీకు ఎటువంటి బాధ్యత లేదు అని, మరీ ఈ రోజు గుర్తింపు సంఘాలు కార్మికుల పక్షాన మాట్లాడనప్పుడు, వాళ్ళ హక్కులను పరిరక్షణకై మా మీద గురుతరమైన బాధ్యత ఉంది.నేడు సింగరేణి ఇన్వాలిడేషన్ ఒక్క సమస్య అయితే, అసలు సింగరేణి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది.నేటి ప్రభుత్వంలో కార్మికుల జీతాలు ఇవ్వడం కొరకు ఏ బ్యాంకు ఓడి ఇస్తదా అని బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న పరిస్థితి కనపడుతుంది.ఈ రోజు రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి బిల్స్ ఇవ్వకపోగా దాదాపు 55 వేల కోట్ల రూపాయలు సింగరేణి సంస్థకు బాకీ పడ్డది.దీని వల్ల సింగరేణి సంస్థ దివాళా తీసే పరిస్థితి ఏర్పడింది.కేసీఆర్ గారి నాయకత్వంలో బొగ్గు టెండర్లు ఎటువంటి రాజకీయా ప్రమేయం లేకుండా నిర్వహించడం జరిగింది. సింగరేణిలో వారసత్వ ఉద్యోగాల అంశంలో ప్రభుత్వం మొండి వైఖరి అవలంబిస్తోందని ఆరోపించారు.



సింగరేణిలో సుమారు 13 వేల మంది కార్మిక కుటుంబాలకు సంబంధించిన వారసత్వ ఉద్యోగాల మెడికల్ అన్‌ఫిట్ అంశంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని గండ్ర ఆరోపించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా మొండిచేయి చూపడం సరి కాదని అన్నారు.భూపాలపల్లి అభివృద్ధి అంతా గత ప్రభుత్వ హయాంలోనే జరిగిందని, ప్రస్తుత ప్రభుత్వం జిల్లాకు ప్రత్యేకంగా చేసిన అభివృద్ధి ఏదీ కనిపించడం లేదని ఆయన విమర్శించారు. భూపాలపల్లిని జిల్లాగా ఏర్పాటు చేయడం, మెడికల్ కాలేజీ మంజూరు చేయడం వంటి కీలక నిర్ణయాలు గత ప్రభుత్వంలోనే తీసుకున్నట్లు గుర్తుచేశారు.సింగరేణి కార్మికులకు అవసరమైన వసతులు ఎక్కడ లేని విదంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ వంటి సంక్షేమ కార్యక్రమాలు గత ప్రభుత్వంలో అమలు చేశామని పేర్కొన్నారు.కాబట్టి రాష్ట్ర ముఖ్యమంత్రి పనితీరు ఎలా ఉందో ఒక్కసారి ఆలోచన చేయాలి.

అదే విధంగా ఈ నెల 12వ తేదీన మాజీ మంత్రివర్యులు, ఎమ్మెల్యే హరీష్ రావు గారు భూపాలపల్లి బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి విచ్చేస్తున్నా నేపథ్యంలో సింగరేణి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# ఇంధన ధరల పెంపుపై ఎర్రజెండా పోరు..!

**పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల తగ్గింపే లక్ష్యం -- కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయండి**

**కామ్రేడ్ బి. అయోధ్య ఆశయాలు నెరవేర్చుదాం..!**

**సీపీఐ శాంతినగర్ శాఖ సభ్యుడు కర్నే రామారావు పిలుపు**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి నీలగిరివార్త: జూన్ : 09**

కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను వెంటనే తగ్గించి సామాన్య ప్రజలపై పడుతున్న భారాన్ని తొలగించాలని డిమాండ్ చేస్తూ రేపు కొత్తగూడెంలో నిర్వహించే కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ శాంతినగర్ శాఖ సభ్యుడు కర్నే రామారావు పిలుపునిచ్చారు.ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులతో కుమ్మక్కై పెద్ద పారిశ్రామిక వేత్తలకు లబ్ధి చేకూరుస్తూ, మరోవైపు సామాన్య ప్రజలపై మోయలేని ఆర్థిక భారాలను మోపుతోందని విమర్శించారు. ఇప్పటికే నిరుద్యోగం, పెరుగుతున్న జీవన వ్యయం, ఆకలి చావులు, ఆత్మహత్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెంపు “మునిగే నక్కపై తాటిపండు పడినట్లు” మారిందన్నారు.నిత్యావసర వస్తువుల ధరలు కూడా ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో ప్రభుత్వం చౌక ధరల దుకాణాల ద్వారా ప్రజలకు అవసరమైన వస్తువులను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం సీపీఐ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ పోరాటానికి ప్రజలు, కార్మికులు, రైతులు, యువత పెద్దఎత్తున మద్దతు ఇవ్వాలని కోరారు.రేపు ఉదయం 10 గంటలకు కొత్తగూడెం కలెక్టరేట్ వద్ద జరిగే ముట్టడి కార్యక్రమంలో శాంతినగర్ శాఖ నుంచి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కర్నే రామారావు విజ్ఞప్తి చేశారు. “ధరల దోపిడీకి వ్యతిరేకంగా ప్రజా పోరు... కలెక్టరేట్ ముట్టడితో కేంద్ర ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక!”

# ఉచిత శిక్షణతో ఉద్యగ అవకాశాలు-జిల్లా కలెక్టర్ కె.హరిత

**నీలగిరివార్త: ఆసిఫాబాద్ 09 జూన్ 2026**

ఆసిఫాబాద్ జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు వృత్తి విద్యా కోర్సు లలో ఉచితంగా శిక్షణ తీసుకోవడం ద్వారా ఉపాధి అవకాశాలను మెరుగు పరుచుకోవచ్చని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు.మంగళవారం జైనూర్ మండల కేంద్రంలోని ఒక వేడుక మందిరంలో జీఎంఆర్ వరలక్ష్మి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు వృత్తి విద్యా కోర్సులలో ఉచితంగా శిక్షణ అందించేందుకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీఎంఆర్ వరలక్ష్మి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు 3 నెలల పాటు హైదరాబాద్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. శిక్షణా కాలంలో ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కూడా కల్పించడం జరుగుతుందని, కాబట్టి జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.జీఎంఆర్ వరలక్ష్మి సంస్థ వారు మొత్తం 8 రకాల వృత్తి విద్యా కోర్సులలో శిక్షణ ఇస్తున్నారని, శిక్షణ పూర్తికాగానే ఉపాధి అవకాశాలను కూడా కల్పిస్తారని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు 3 నెలల పాటు హైదరాబాద్‌కు వెళ్లి శిక్షణ పొందడానికి ముందుకు రావడం చాలా సంతోషకరమని కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు.

**శిక్షణ ఇచ్చే 8 రకాల కోర్సులు:**

1. సహాయ విద్యుత్ కార్మికుడు
2. నకిలీ పైకప్పు సాంకేతిక నిపుణుడు
3. వెల్డింగ్ మరియు తయారీ
4. ద్విచక్ర వాహనాల మరమ్మత్తు
5. హోటల్ నిర్వహణ
6. ముందు కార్యాలయ నిర్వాహకుడు – బాలికలకు మాత్రమే
7. గృహ విద్యుత్ ఉపకరణాల మరమ్మత్తు
8. శీతలీకరణ యంత్రం మరమ్మత్తు

ఈ 8 రకాల కోర్సులలో 3 నెలల పాటు ఉచిత శిక్షణ పొందిన తర్వాత వంద శాతం హామీగా ఉద్యోగ, స్వయం ఉపాధి



అవకాశాలు లభిస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. జూలై 1 నుండి సెప్టెంబర్ 30 వరకు ఈ 3 నెలల శిక్షణా కార్యక్రమం ఉంటుందని, జిల్లా నుండి ఎక్కువ సంఖ్యలో అర్హులైన నిరుద్యోగ యువతీ యువకులు ముందుకు వచ్చి హైదరాబాద్‌లోని శిక్షణా కేంద్రాన్ని సందర్శించి శిక్షణ పొందాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జీఎంఆర్ వరలక్ష్మి సంస్థ ప్రతినిధులు, జిల్లా ఉపాధి శాఖ అధికారి, స్థానిక ప్రజాప్రతినిధులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి మరియు పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు.

# కెక్కెర్ల రాజయ్య నేత్రదానం - ఇద్దరి జీవితాల్లో వెలుగు

**కమాన్ పూర్ నీలగిరివార్త: జూన్ 9.**

రామగిరి మండలానికి బేగంపేట చెందిన కెక్కెర్ల రాజయ్య మరణానంతరం వారి కుటుంబ సభ్యులు గొప్ప మానవతా నిర్ణయం తీసుకొని నేత్రదానానికి అంగీకరించారు. ఈ సందర్భంగా రాజయ్య రెండు కార్నియాలను సేకరించి అవసరమైన వారికి అందించేలా చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ డైరెక్టర్ గంట వెంకట రమణ రెడ్డి మాట్లాడుతూ, మరణానంతరం కూడా మరొకరికి చూపునిచ్చే నేత్రదానం అత్యున్నత దానమని అన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ నేత్రదానంపై అవగాహన పెంపొందించుకొని ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. రాజయ్య కుటుంబ సభ్యులు తీసుకున్న ఈ గొప్ప నిర్ణయం ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు.మృతు మేకల మారుతి యాదవ్ మాట్లాడుతూ, కుటుంకరించి ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపిన రాజయ్య కుటుంబ సభ్యుల సేవా భావాన్ని అభినందించారు. వారి ఈ మానవతా నిర్ణయం సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని, మరెందరో నేత్రదానానికి ముందుకు రావడానికి స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో



లయన్స్ క్లబ్ డైరెక్టర్ , కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి బుద్ధార్థి బుచ్చయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి, తోట చంద్రయ్య, తులసి రామ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మోతుకూరి అవినాష్ గౌడ్, సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి లింగమూర్తి, సభ్యులు సమ్మయ్య తదితరులు పాల్గొని రాజయ్య కుటుంబ సభ్యులను అభినందించారు. రాజయ్య కుటుంబం చూపిన ఈ మానవతా స్ఫూర్తి సమాజానికి స్ఫూర్తిదాయకమని గ్రామస్తులు పేర్కొన్నారు.

# ప్రకృతి సరికొత్త అందాలకు మురుదేశ్వర ఆలయం నాంది

**సముద్ర తీరాన వెలసిన ఆధ్యాత్మిక పకృతి అద్భుతం**

**పుణ్యక్షేత్రం ఆధ్యాత్మిక సంతృప్తిని అందించింది.**

**పుణ్యక్షేత్రాన్ని దర్శించుకున్న జర్నలిస్టులు దిర్శనం శంకర్, వనరాశి జగన్**

నీలగిరి వార్త ప్రతినిధి షాద్ నగర్

అరేబియా సముద్రపు అలల మధ్య, ప్రకృతి ఒడిలో ప్రశాంతంగా కొలువై ఉన్న కర్ణాటక రాష్ట్రంలోని మురుదేశ్వర ఆలయం భక్తి, ప్రకృతి, ఆధ్యాత్మికతల సమ్మేళనంగా నిలుస్తోందని జర్నలిస్టులు దిర్శినం శంకర్, వనరాశి జగన్ అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ....కర్ణాటక తీర ప్రాంతంలో వెలసిన ఈ పవిత్ర క్షేత్రం భక్తులకు దైవ దర్శనంతో పాటు అద్భుతమైన ప్రకృతి సోయగాలను కూడా అందిస్తోంది.మూడు వైపులా సముద్ర జలాలతో చుట్టుముట్టబడిన ఈ ఆలయం, భూమి మరియు సముద్రం కలిసిన అపూర్వ దృశ్యాన్ని ఆవిష్కరిస్తుంది.ఆలయ ప్రాంగణంలో నిలబడి చూస్తే, అంతులేని సముద్ర విస్తీర్ణం మనసుకు అపూర్వమైన ప్రశాంతతను కలిగిస్తుంది. అలలు ఒడ్డును తాకుతూ వినిపించే మధుర నాదం భక్తులను ఆధ్యాత్మిక లోకంలోకి తీసుకెళుంది.ఉదయాన్నే సూర్యుడు సముద్ర తీరాన్ని తాకుతూ తన బంగారు కిరణాలను విరజిమ్మినప్పుడు కనిపించే దృశ్యం కనుల పండువగా ఉంటుంది. అలాగే సాయంత్రం సూర్యాస్తమయం సమయంలో ఆకాశం ఎరుపు, నారింజ రంగులతో కళకళలాడుతూ ప్రకృతి అందాలకు కొత్త నిర్వచనం ఇస్తుంది. ఈ దృశ్యాలను తిలకించేందుకు దేశ విదేశాల నుంచి వేలాది మంది పర్యాటకులు తరలివస్తుంటారు.మురుదేశ్వర ఆలయం కేవలం ఒక పుణ్యక్షేత్రనికి పరిమితం అనుకుంటారు. కానీ ఇది ప్రకృతి ప్రేమికులకు, ఫోటోగ్రాఫర్లకు, ఆధ్యాత్మిక అన్వేషకులకు ఒక అపూర్వ గమ్యం. ఇక్కడి ప్రశాంత వాతావరణం మనసులోని ఆందోళనలను తొలగించి కొత్త ఉత్సాహాన్ని నింపుతుంది.భక్తి భావనతో శివుడిని దర్శించిన భక్తులకు ఈ క్షేత్రం ఆధ్యాత్మిక అనుభూతిని అందిస్తే, ప్రకృతి అందాలను ఆస్వాదించే వారికి జీవితం ఎంత అందమైనదో గుర్తు చేస్తుంది. అందుకే మురుదేశ్వరం ప్రకృతి సరికొత్త అందాలకు నాంది పలికే ఆధ్యాత్మిక క్షేత్రంగా విశేష ఖ్యాతిని పొందింది.సముద్ర అలల సవ్వడిలో శివనామం వినిపించే చోటు మురుదేశ్వరం...ప్రకృతి అందాలు, ఆధ్యాత్మిక ప్రశాంతత కలిసిన అపూర్వ దివ్యక్షేత్రం.

ఆలయంలోని ముఖ్యమైన విశిష్టతలో ప్రపంచంలోనే ఎత్తైన శివ విగ్రహాలలో ఒకటి,ఆలయ ప్రాంగణంలో సుమారు 123 అడుగుల ఎత్తైన మహాదేవుని విగ్రహం ఉంది.సముద్రం ఒడ్డున కొలువై ఉన్న ఈ విగ్రహం దూరం నుంచే దర్శనమిస్తుంది.ఆలయానికి చెందిన రాజగోపురం సుమారు 20 అంతస్తులతో నిర్మించబడి ఉంది.దీనిని భారతదేశంలోని ఎత్తైన దేవాలయ గోపురాలలో ఒకటిగా పేరొందింది.మూడు వైపులా సముద్ర జలాలతో చుట్టుముట్టబడిన ఈ క్షేత్రం పర్యాటకులకు ఆధ్యాత్మిక మానసిక ప్రశాంతత లభిస్తుంది.ఆలయం నుండి కనిపించే సూర్యోదయం, సూర్యాస్తమయ దృశ్యాలు ఎంతో మనోహరంగా ఉంటాయి. ప్రతి ఒక్కరు ఈ అందాలను వీక్షించి.... మానసిక ప్రశాంతత కచ్చితంగా లభిస్తుందని అంటున్నారు. ఈ యాత్ర మనసుకు సంతృప్తిని అందించిందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బక్కని పవన్ కుమార్, రామకృష్ణ , రామ్ మిత్రబృందంతో దర్శించుకున్నారు.






# ఎల్లకొండ గేటు నుండి గ్రామంలోకి వెళ్లే ఆర్ అండ్ బి.రోడ్డు దారుణంగా ఉంది

**వర్షాకాలంలో వాహనాలపై వెళ్లే వారికి నరకయాతన**

**ఆర్ అండ్ బి. అధికారులు వెంటనే స్పందించి రోడ్డు వేయాలి**

**బిజెపి ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు. బ్యాగరి. గాలయ్య**

నీలగిరి వార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి నవాబు పేట్ మండలం

నవాబ్ పేట్ మండల పరిధి ఎల్లకొండ గేటు నుండి ఎల్లకొండ గ్రామం వరకు వచ్చి పోయే వాహనదారులకు రోడ్డు బాగాలేక చాలా ఇబ్బందులకు గురవుతున్నారని అదేవిధంగా గత కొన్ని సంవత్సరాలుగా గ్రామ ప్రజలు ఎంతో ఇబ్బంది పడుతున్నారు ప్రభుత్వాలు మారిన రోడ్ల పరిస్థితులు అలాగే ఉన్నాయని బిజెపి ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు. బి. గాలయ్య పేర్కొన్నారు అదేవిధంగా ఆర్ అండ్ బి అధికారులు వెంటనే సమస్యలు తెలుసుకుని పనులు ప్రారంభించి రోడ్డును వేయాలని తెలియజేశారు. నాలుగు చినుకులు పడితే రోడ్డు మొత్తం చిత్తడి చిత్తడి అవుతుంది వచ్చిపోయే వాహనాలు జారీ కిందపడి గాయాల పాలు కావడం జరుగుతుందని అందువల్లనే భారీ వర్షాలు రాకముందే ఎల్లకొండ గేటు నుండి ఎల్లకొండ గ్రామం మీదుగా మిగతా గ్రామాల ప్రజలు నిరంతరం తిరుగుతూ ఉంటారని అందువలన ప్రజలకు ఇబ్బందులు కాకుండా ఆర్ అండ్ బి అధికారులు వెంటనే రోడ్డు మరమ్మతులు చేసి సమస్యలు తీర్చాలని కొత్త రోడ్లు వేసే విధంగా పనులు చేస్తే వచ్చి పోయే గ్రామ ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని బిజెపి ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు. బి. గాలయ్య తెలియజేశారు.







# పార్టీ మరీనా ఎమ్మెల్యే గాంధీకి దమ్ముంటే రాజీనామా చేసి మళ్లీ గెలవాలి.

**శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డ బొబ్బ నవతా రెడ్డి..**

శేరిలింగంపల్లి నీలగిరి వార్త ..

శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి పనుల శంకుస్థాపనల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరైన సభ పూర్తిగా విఫలం కావడంతో, ఆ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తమపై అభాండాలు వేస్తున్నారని బొబ్బ నవతా రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. దమ్ము, ధైర్యం ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మళ్లీ గెలిచి తన సత్తా నిరూపించుకోవాలని ఆమె సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి సభ వైఫల్యంపై, ఎమ్మెల్యే గాంధీ చేసిన వ్యాఖ్యలపై బొబ్బ నవతా రెడ్డి ఒక ప్రకటనలో ఘాటుగా స్పందించారు.సీఎం సభ ఫ్లాప్ అయితే.. మాపై ఏడుపా?ముఖ్యమంత్రి సభకు ప్రజలు రాకపోవడం, వచ్చిన వారికి కనీస సదుపాయాలు కల్పించలేకపోయిన ఎమ్మెల్యే గాంధీ సీఎం ముందే ప్రతిపక్షాలపై నెపం నెట్టడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని నవతా రెడ్డి విమర్శించారు. ప్రతిపక్షం వారు ఇంటింటికీ వెళ్లి శాలువాలు కప్పి, గడియారాలు పంపిణీ చేసి మీటింగ్ కు వెళ్లొద్దని చెప్పడం వల్లే జనం రాలేదని స్వయంగా సీఎం ముందే ఎమ్మెల్యే క్షమాపణలు కోరడం సిగ్గుచేటన్నారు. గత రెండు నెలలుగా బీఆర్ఎస్ అడినాయకులు కెసిఆర్, కేటీఆర్ , హరీశ్ , కృష్ణ ఫోటోలతో కూడిన గడియారాలను పంచుతూ.. గడప గడపకూ తిరుగుతూ ప్రజల కష్టసుఖాల్లో తాము ఉంటున్నామని, అది చూసి భరించలేక, కడుపుమంటతోనే ఎమ్మెల్యే గాంధీ ముఖ్యమంత్రి ముందు ఇంత చిల్లరగా మాట్లాడుతున్నారని ఆమె దుయ్యబట్టారు. అధికారం ఎవరిదైతే వారికి సలాం కొట్టే తీరు నిది. అసలు ఎమ్మెల్యే గాంధీ ఏ పార్టీలో ఉన్నారో, ఆయన అధినాయకుడు ఎవరో ప్రజలకు చెప్పే ధైర్యం ఉందా? అని నవతా రెడ్డి నిలదీశారు. సైకిల్ (టీడీపీ) గుర్తుపై గెలిచి కారెక్కిన గాంధీ.. మళ్లీ కారు (బీఆర్ఎస్) గుర్తుపై గెలిచి ఇప్పుడు కాంగ్రెస్ నాయకుల చేతిలో చెయ్యి వేశారని ఎద్దేవా చేశారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి వంగి సలాం కొట్టడం, ఆ ముఖ్యమంత్రిని పొగడటం ఆయనకు అలవాటుగా మారిందన్నారు. 2018, 2023 ఎన్నికల్లో రూ. 5 వేల కోట్లు, రూ. 9 వేల కోట్లతో నియోజకవర్గాన్ని అమెరికా తరహాలో అభివృద్ధి చేశానని గొప్పలు చెప్పిన ఆయన.. ఇప్పుడు రేవంత్ రెడ్డికి దొంగ నమస్కారాలు పెడుతున్నారని విమర్శించారు.బీఆర్ఎస్ పార్టీ పేరు ఎత్తే హక్కు, అర్హత గాంధీకి లేవన్నారు.అంకెల గారడీ.. క్రెడిట్ కొట్టేసే కుట్రకేసీఆర్, కేటీఆర్ హయాంలో నగరంలో 30 నుంచి 40 ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రెండు ఫ్లైఓవర్లు ప్రారంభించి 200 మాటలు చెబుతూ పెద్ద హంగామా చేస్తోందని విమర్శించారు. చేసేది రూ. 800 కోట్ల పనులైతే, వాటిని రూ. 2 వేల కోట్లుగా తప్పుడు లెక్కలు చూపుతున్నారని మండిపడ్డారు. శంకుస్థాపన చేసిన రూ. 1600 కోట్ల పనుల్లో శేరిలింగంపల్లికి చెందినవి కేవలం రూ. 600 కోట్లేనని, మిగతా శంకర్‌పల్లి, ఓఆర్ఆర్, కొల్లూరు, బాచుపల్లి తదితర ప్రాంతాల పనులను కూడా ఇక్కడివే అని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. చందానగర్‌లో జర్నలిస్టులు, మార్వాడీలు, మైనార్టీలు, వివిధ కుల సంఘాలకు భవనాల కోసం స్థలాలు కేటాయించింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, కానీ ఆ క్రెడిట్ రేవంత్ రెడ్డికి ఇస్తూ గాంధీ అసత్యాలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దమ్ముంటే ఆ స్థలాల్లో భవనాలు నిర్మించి అప్పుడు గొప్పలు చెప్పుకోవాలన్నారు. పాత హామీలేమయ్యాయి.. శిలాఫలకాలు వెక్కిరిస్తున్నాయి. గత పదేళ్లుగా వాగ్దానాలు చేసి వదిలేసిన 700 పడకల ఆసుపత్రి, 50 ఎకరాల్లో బస్ టెర్మినల్, మియాపూర్–బీహెచ్ఈఎల్ సింగిల్ పిల్లర్ మెట్రో, చెరువుల సుందరీకరణ, 16 ఎస్టీపీ ప్లాంట్లు, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి ఏమయ్యాయని నవతా రెడ్డి ప్రశ్నించారు. ఈ హామీలన్నీ గాలికొదిలేసి రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల కోసమే మళ్లీ కొత్త శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. గతంలో ఎన్నికల సమయంలో ఆయన వేసిన శిలాఫలకాలే ఇప్పుడు ఆయన్ను చూసి వెక్కిరిస్తున్నాయని ఆమె ఘాటుగా విమర్శించారు



# సీఎం సభలో మియాపూర్ డివిజన్ కాంగ్రెస్ శ్రేణుల హల్ చల్..

మియాపూర్ నీలగిరి వార్త ..

కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభోత్సవాలు , శంకుస్థాపనలు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించిన అనంతరం మియాపూర్ లో భారీ బహిరంగసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎం ఎ నగర్ కి చెందిన కాంగ్రెస్ పార్టీ యువత ఉత్సాహంగా సభా వేదిక వరకు ర్యాలీ గా బయలుదేరి వెళ్ళారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హలచల్ చేస్తూ నినాదాల తో హోరెత్తించారు. ఈ కార్యక్రమం జగదీశ్వర్ గౌడ్ అద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దోర్నాల రవి కుమార్ గౌడ్ తాంద్ర రామచందర్ గౌడ్,చింతల సురేష్ కురుమసుంత్రమోని సత్యరాజ్ ముదిరాజ్,సిద్ధాపూర్ రాజు రెడ్డి, బైకడీ శ్రీకాంత్, కదుకుంట్ల రాఘవేంద్ర యాదవ్, చాపల సాయికిరణ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



# ఓటు హక్కు పరిరక్షణలో బి ఎల్ ఎల పాత్ర కీలకం

**- సర్ రాష్ట్ర కన్వీనర్, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి**

**- విజయవంతంగా తాండూరు నియోజకవర్గ బి ఎల్ ఎ ల శిక్షణ శిబిరం.**

తాండూరు, జూన్ 9 :

ఓటు హక్కు పరిరక్షణలో బి ఎల్ ఎల పాత్ర కీలకం సర్ రాష్ట్ర కన్వీనర్, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సర్ కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో తాండూరు పట్టణంలోని వినాయక కన్వెన్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లు బి ఎల్ ఎల కోసం ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించారు.ముఖ్య అతిథిగా సర్ రాష్ట్ర కన్వీనర్, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి , డీసీసీ అధ్యక్షుడు ధారసింగ్, టీపీసీసీ నియమించిన ప్రత్యేక ట్రైనర్ వెంకట రమణ , సర్ నియోజకవర్గ కన్వీనర్ పురుషోత్తం రావు , మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి, మాజీ ఛైర్పర్సన్ స్వప్న పరిమల్ సర్ విధివిధానాలు, ఓటరు జాబితా, సవరణ ప్రక్రియ, బాధ్యతలు మరియు చేపట్టాల్సిన కార్యాచరణపై సమగ్ర అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం చెబుతున్నట్లు సర్ ప్రక్రియ అనేది ప్రజాస్వామ్యం బలపడేట్లు జరగడం లేదు, ఈ సారి జరిగే సర్ ప్రక్రియ బీజేపీ ప్రభుత్వం కనుసైగలో ప్రజాస్వామ్యంకు ముప్పు తేచ్చే విధంగా కొనసాగుతుందన్నారు.సర్ ప్రక్రియలో ముఖ్యంగా నకిలీ ఓట్లు, డబుల్ ఓట్లు తొలగించడం జరగాలి, కానీ ఇప్పటికే సర్ ప్రక్రియ జరిగిన బీహార్, పశ్చిమ బెంగాల్ తో పాటు పలు రాష్ట్రలను మనం గమనిస్తే అక్కడ నకీలీ ఓట్లు, డబుల్ ఓట్లు తొలగించడం ప్రక్కన పెడితే బీజేపీ వ్యతిరేక ఓట్లను తొలగించడం పనిగా పెట్టుకున్నారు.రాజ్యాంగం బద్దంగా కేంద్రం ఎన్నికల సంఘం పరివేక్షణలో జరిగే సర్ ప్రక్రియ బీజేపీ ప్రభుత్వం కనుసైగలో జరుగుతుంది కావున, మీరు బి ఎల్ ఎ లు, మీము (ప్రజాప్రతినిధులం) దానికి అడ్డు కట్టవేయడానికీ సిద్దంగా ఉండాలని సూచించారు. ఈ నెల జూన్ 25 నుండి జూలై 24 వరకు బి ఎల్ ఎ లు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలు స్వీకరిస్తారని తెలిపారు. ఈ నెల రోజుల వ్యవది అనేది మనకి చాల ముఖ్యమైనది,ఈ సమయంలో మన పార్టీ తరుపున నియమించిన బి ఎల్ ఎ లు వారితో కలిసి పని చేయాల్సిన అవసరం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, మున్సిపల్ మరియు మార్కెట్ కమిటీ ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## తాళ్లపూడిలో ఇసుక అక్రమ రవాణా గుట్టురట్టు: మూడు లారీలు సీజ్!

**కొవ్వూరు నీలగిరి వార్తప్రతినిధి**

తాళ్లపూడి మండలంలో నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఇసుక అక్రమ రవాణాపై మైనింగ్ అధికారులు ఉక్కుపాదం మోపారు. తాళ్లపూడి-1, తాళ్లపూడి-2 ఇసుక రీచ్‌ల (ర్యాంపుల) నుండి ఇసుకను తరలిస్తున్న లారీలను మంగళవారం మైనింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) ఫణిభూషణ్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో రవాణాదారుల పెద్ద మోసం వెలుగుచూసింది. ఒకే బిల్లు పేరుతో రెండుసార్లు ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు లారీలను అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఒకే బిల్లును రీ-యూజ్ చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నట్లు అధికారులు గుర్తించారు మైనింగ్ ఏడీ ఫణిభూషణ్ రెడ్డి హెచ్చరిక: "ఇసుక రవాణాలో ఎలాంటి అక్రమాలకు పాల్పడినా సహించేది లేదు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు."నిబంధనలు ఉల్లంఘించిన ఆ మూడు లారీలను అధికారులు తక్షణమే సీజ్ చేసి, తదుపరి చర్యల నిమిత్తం తాళ్లపూడి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




## కూటమి మోసాలపై వైకాపా పోరు

**కొవ్వూరు నీలగిరి వార్త ప్రతినిధి**

తాళ్లపూడి భూటకపు మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా తీవ్రంగా మోసం చేసిందని కొవ్వూరు నియోజకవర్గ వైఎస్సార్సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే వైకాపా రౌండ్ టేబుల్ సమావేశాల ముఖ్య ఉద్దేశ్యమని ఆయన పేర్కొన్నారు.తాళ్లపూడి బస్టాండ్ సమీపంలోని సత్రం వద్ద వైఎస్సార్సీపీ నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తల తో మంగళవారంసమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని పలు గ్రామాల నుండి నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. తలారి వెంకట్రావు మాట్లాడుతూ ఆరోపణల సారాంశం: అన్ని వర్గాలకూ అన్యాయం:లివైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో కులమతాలకు అతీతంగా ప్రతి పేదవాడికి న్యాయం జరిగిందని తలారి గుర్తుచేశారు. కానీ నేడు కూటమి ప్రభుత్వం 'సూపర్ సిక్స్' పేరుతో నమ్మించి విద్యార్థులను, రైతులను, మహిళలను.. ఇలా అన్ని వర్గాలనూ నట్టేట ముంచిందని ఆరోపించారు.

దోపిడీయే లక్ష్యం: కూటమి నాయకులు ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేశారని, ఇసుక, మట్టి, మద్యం వ్యాపారాల్లో మునిగితేలుతూ కోట్లాది రూపాయలు వెనకేసుకుంటున్నారని విమర్శించారు.నల్ల బెలూన్లతో నిరసన:వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు వెన్నుపోటుకు రెండేళ్లు" అనే కార్యక్రమాన్ని తాళ్లపూడిలో విజయవంతంగా చేపట్టారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై రౌండ్ టేబుల్ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం ప్రభుత్వ తీరుకు నిరసనగా నాయకులంతా కలిసి గాల్లోకి నల్ల బెలూన్లను ఎగురవేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తాళ్లపూడి మండల వైఎస్సార్సీపీ అధ్యక్షులు కొలిశెట్టి నాగేశ్వరరావు, ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు పోసిన శ్రీలేఖ, మరియు నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## జగిత్యాల జిల్లాలో డయేరియా, పోలియో, నులిపురుగుల నిర్మూలనే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ

### జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్.

**జగిత్యాల జిల్లా ప్రతినిధి :నీలగిరి వార్త ప్రతినిధి )**

**జూన్ 09 :**

జగిత్యాల జిల్లాలో ప్రజారోగ్యాన్ని మెరుగుపరిచేందుకు వైద్య ఆరోగ్యశాఖ చేపట్టిన డయేరియా నియంత్రణ,పల్స్ పోలియో, జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాలపై జిల్లా సమన్వయ కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ జి. సుజాత పాల్గొని మూడు కీలక ఆరోగ్య కార్య క్రమాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లల్లో డయేరియా పూర్తిగా అరికట్టేందుకు జూన్ 16 నుండి జులై 31 వరకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జూన్ 1 నుండి 15 వరకు సన్నాహక ఏర్పాట్లు పూర్తి చేసి, ప్రధాన కార్యక్రమాన్ని చేపట్టాలని, ప్రతి ఇంట్లో ఐదేళ్లలోపు పిల్లల సంఖ్యకు అనుగుణంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలను అందుబాటులో ఉంచాలని సూచించారు. తల్లులకు అవసరమైన కౌన్సిలిం గ్ ఇవ్వడంతో పాటు, మురికి వాడలు పారిశుద్ధ్యం, సురక్షిత త్రాగు నీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశా ,లైన్ డిపార్ట్మెంట్ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా జూన్ 28న బూత్ స్థాయిలో పోలియో చుక్కల మందు పంపిణీ చేసి, జూన్ 29, 30 తేదీలలో వైద్య సిబ్బంది, వాలంటీర్ల ద్వారా ఇంటింటికి తిరిగి పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నట్లు వెల్లడించారు. 2014 నున్న పిల్లలను కూడా గుర్తించి, పోలియో చుక్కలు వేయాలని స్పష్టం చేశారు. ఒక సంవత్సరం నుండి 19 సంవత్సరాల లోపు వారందరికీ జులై 13 న అల్బెండజోల్ మాత్రలను అందజేయడం ద్వారా రక్తహీనతను అరికట్టేందుకు జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలల్లో నోడల్ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులకు మాత్రలు వేయాలని, గ్రామీణ స్థాయిలో అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ ఈ ఆరోగ్య కార్యక్రమాలను దిగ్విజయంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ బి.రాజ గౌడ్, జిల్లా ఆసుపత్రి సూపర్డెంట్, డిప్యూటీ డీఎం, డీఎంఓ శ్రీనివాస్ , ప్రోగ్రాం ఆఫీసర్లు ,జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి నరేంద్ర , డిడబ్ల్యుఓ , డిపిఓ ,డిపిఆర్ఓ, డిఇఓ, మున్సిపల్ కమిషనర్లు , ఎస్ఈ ట్రాన్స్కో ,జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## పిల్లల ఎదుగుదల లోపాలను తొలిదశలోనే గుర్తించాలి: సి.డి.పి.ఓ కె.నాగలక్ష్మి

**కొవ్వూరు నీలగిరి వార్తప్రతినిధి**

తాళ్లపూడి పిల్లల ఎదుగుదలలో ఉండే లోపాలను చిన్న వయసులోనే గుర్తించి, వారి మానసిక, శారీరక ఎదుగుదలకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐ.సి.డి.ఎస్ సి.డి.పి.ఓ కె.నాగలక్ష్మి పిలుపునిచ్చారు. 'నవచేతన' కార్యక్రమంలో భాగంగా తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం హైస్కూల్‌లో అంగన్‌వాడీ టీచర్లకు ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సి.డి.పి.ఓ నాగలక్ష్మి మాట్లాడుతూ.. 'నవచేతన' మొబైల్ యాప్ ద్వారా పిల్లల ఎదుగుదలను ఎలా అంచనా వేయాలో వివరించారు. ఈ యాప్ సహాయంతో ఎదుగుదల లోపాలను తొలిదశలోనే గుర్తించే విధానాలపై టీచర్లకు అవగాహన కల్పించారు. లోపాలు ఉన్నట్లు గుర్తించిన 0 నుండి 6 నెలల లోపు చిన్నారులను స్థానిక ప్రభుత్వ వైద్యుల వద్దకు తీసుకెళ్లి, పరీక్షలు చేయించి వారి సూచనలు పాటించాలని ఆమె స్పష్టం చేశారు.తాళ్లపూడి, మలకపల్లి సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు మలకపల్లి ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ అన్నపూర్ణ ప్రత్యేక అవగాహన కల్పించారు. చిన్న పిల్లల్లో గమనించాల్సిన ముఖ్యమైన ఆరోగ్య, శారీరక మార్పులు, లోపాలను ఎలా గుర్తించాలనే అంశాలపై ఆమె దిశానిర్దేశం చేశారు.తాళ్లపూడి



మండలంలో పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించి, ఉత్తమ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను అభినందిస్తూ వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు భానుమతి, పద్మిని మరియు మండల పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు కార్యకర్త లు పాల్గొన్నారు.

## జగదీశ్వర్ గౌడ్ అద్వర్యంలో నిర్వహించిన అభివృద్ధి ర్యాలీ..

### పాల్గొన్న యలమంచి ఉదయ్ కిరణ్ టీమ్ సభ్యులు..

**మియాపూర్ నీలగిరి వార్త ..**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మియాపూర్ చౌరస్తా వద్ద నిర్వహించిన మహా బహిరంగ సభలో శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ టీపీసీసీ జనరల్ సెక్రటరీ జగదీశ్వర్ గౌడ్ నాయకత్వంలో నిర్వహించిన భారీ అభివృద్ధి ర్యాలీలో మియాపూర్ డివిజన్ జనరల్ సెక్రటరీ, కాంగ్రెస్ నాయకులు యలమంచి ఉదయ్ కిరణ్ తమ టీమ్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆల్విన్ క్రాస్ రోడ్స్‌లోని విజేత నుంచి సభా ప్రాంగణం వరకు సాగిన ఈ భారీ ర్యాలీ ప్రజల ఆకాంక్షలకు, శేరిలింగంపల్లి అభివృద్ధిపై ప్రజల్లో ఉన్న విశ్వాసానికి ప్రతీకగా నిలిచింది. ర్యాలీలో పాల్గొన్న కార్యకర్తలు మాస్కులు ధరించి, అభివృద్ధి సందేశాలతో కూడిన ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రజల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ భవిష్యత్ అభివృద్ధికి దిశానిర్దేశం చేసే సుమారు రూ.2,000 కోట్లకు పైగా విలువైన పలు ప్రతిష్టాత్మక అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన జరగడం చారిత్రాత్మక ఘట్టంగా నిలిచింది. ప్రధానంగా మియాపూర్ ఫ్లైఓవర్, లింగంపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జ్ (ఆర్వోబీ), గచ్చిబౌలి ఐ ఐ టి జంక్షన్ ఫ్లైఓవర్, ఖాజాగూడ జంక్షన్ ఫ్లైఓవర్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, కోర్ అర్బన్ స్కూల్స్ వంటి కీలక ప్రాజెక్టులు శేరిలింగంపల్లి అభివృద్ధికి కొత్త ఊపునిచ్చేలా రూపుదిద్దుకోనున్నాయి. ఈ ప్రాజెక్టులు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు ఆధునిక మౌలిక సదుపాయాల విస్తరణకు దోహదపడనున్నాయి. ప్రజా సంక్షేమం, నాణ్యమైన విద్య, ఆధునిక మౌలిక సదుపాయాల అభివృద్ధి లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టి నాయకత్వంలో ముందుకు సాగుతుండగా, శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధి పథంలో వేగంగా



పురోగమిస్తోందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఈ మహా అభివృద్ధి సభ, ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ ప్రతినిధులు, ఎన్ ఎస్ యు ఐ నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రజల భాగస్వామ్యం, నాయకత్వం యొక్క సంకల్పం, ప్రభుత్వ అభివృద్ధి దృక్పథం కలిసిన ఈ కార్యక్రమం శేరిలింగంపల్లి అభివృద్ధి చరిత్రలో మరో మైలురాయిగా నిలిచిందని నాయకులు అభిప్రాయపడ్డారు.

## వెల్జర్ల గ్రామంలో విషాదం.. పాలమూరు యూనివర్సిటీ విద్యార్థి కార్తీక్ కన్నుమూత

### పాలమూరు యూనివర్సిటీలో విషాదం.. విద్యార్థి కార్తీక్ మృతి

**షాద్ నగర్ (నీలగిరి వార్త ప్రతినిధి )**

మహబూబ్‌నగర్‌లోని పాలమూరు యూనివర్సిటీ క్యాంపస్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. యూనివర్సిటీలో ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న కార్తీక్ అనే విద్యార్థి హాస్టల్ గదిలో మృతిగా కనిపించాడు. ఈ ఘటనతో యూనివర్సిటీ క్యాంపస్‌లో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి.వర్సిటీ వర్గాలు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఫరూక్‌నగర్ మండలం వెల్జర్ల గ్రామానికి చెందిన కార్తీక్





పాలమూరు యూనివర్సిటీలో ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. తన కోర్సుకు సంబంధించిన ప్రాజెక్టు రిపోర్టు సమర్పించేందుకు ఇటీవల యూనివర్సిటీకి వచ్చాడు.అయితే హాస్టల్ గదిలో అతను స్పందించకపోవడంతో తోటి విద్యార్థులు గమనించి యూనివర్సిటీ అధికారులకు సమాచారం అందించారు. అనంతరం ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. మృతికి గల కారణాలపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.కార్తీక్ మృతదేహాన్ని స్వగ్రామమైన వెల్జర్లకు తరలించగా, ఈ విషాద వార్తతో గ్రామంలో తీవ్ర దుఃఖ వాతావరణం నెలకొంది. కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కుటుంబ సభ్యులు బుధవారం అంత్యక్రియల ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

## కల్తీ కారంపొడిపై టాస్క్ ఫోర్స్ మెరుపు దాడులు.. భారీగా స్వాధీనం

**కరీంనగర్ జూన్ 09నీలగిరి వార్త ప్రతినిధి )**





కరీంనగర్ నగరంలోని శనివారం మార్కెట్ పరిధిలో టాస్క్ ఫోర్స్ పోలీసులు మెరుపు దాడులు నిర్వహించి భారీ మొత్తంలో కల్తీ అనుమానిత కారంపొడి, పసుపు, ధనియాల పొడిని స్వాధీనం చేసుకున్నారు. గౌరిశెట్టి రమేష్, సిద్ధంశెట్టి చక్రపాణి సుగంధ ద్రవ్యాల దుకాణాల్లో నిర్వహించిన సోదాల్లో 47 బస్తాల కారంపొడి, 2 బస్తాల పసుపు, 1 బస్తా ధనియాల పొడిని గుర్తించి ఫుడ్ సేఫ్టీ అధికారులకు అప్పగించారు. అధికారులు నమూనాలను సేకరించి పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపగా, ఫలితాలు వచ్చే వరకు స్టాక్‌ను సీజ్ చేసి అమ్మకాలపై నిషేధం విధించారు. కల్తీ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# ఏక్లాస్ పూర్ గ్రామంలో వివో బిల్డింగ్ నిర్మాణానికి భూమి పూజ.

**కోటగిరి, జూన్ 9, నీగిలగిరి వార్త ప్రతినిధి.**

కోటగిరి మండలంలోని ఎక్లాస్పూర్ గ్రామంలో వివో బిల్డింగ్ నిర్మాణానికి భూమి పూజ మంగళవారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో డ్వాక్రా సంఘ సభ్యులకు వివో బిల్డింగ్ను నిర్మాణం చేయడంఈరోజు ఎక్లాస్పూర్ గ్రామంలో ఆ బిల్డింగ్ కి భూమి పూజ నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇర్వంత్ రావు, ఎంపీడీవో విష్ణు,ఏఈపిఆర్ నవదీష్ గౌడ్, గ్రామ పెద్దలు, మహిళా సంఘ లీడర్లు, ఇతర గ్రామస్తులు పాల్గొనడం జరిగింది. జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇర్వంత్ రావు, ఎంపీడీవో విష్ణు, ఏఈపిఆర్ నవదీష్ గౌడ్, గ్రామ పెద్దలు, మహిళా సంఘ లీడర్లు, ఇతర గ్రామస్తులు తదితరులు పాల్గొనడం జరిగింది.



# విజ్ఞాన్ ప్రెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్సై కి పాత్రికేయులు సన్మానం.

**కోటగిరి, జూన్ 9, నీలగిరి వార్త ప్రతినిధి.**

కోటగిరి మండల కేంద్రంలో బదిలీపై వచ్చిన ఎస్సై శ్రీనివాస్ కి విజ్ఞాన్ ప్రెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షులు ఎన్ ,శ్రీనివాసరావు శాలువాతో మంగళవారం రోజు సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీనివాస్ మాట్లాడుతూ కోటగిరి, పోతంగల్ ఉమ్మడి మండలంలో నేర నియంత్రలను శాంతి భద్రలు కాపాడుతామని ఆయన వివరించారు, అక్రమ రవాణా ఇసుక , అక్రమంగా మొరం రవాణా ను అడ్డుకుంటామని ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు విజ్ఞాన్ ప్రెస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ శ్రీనివాసరావు, వడ్డే నర్సింలు, ప్రధాన కార్యదర్శి మూడో జీవన్ , పాత్రికేయులు సమీర్, తదితరులు పాల్గొన్నారు.




# ఎన్టీఆర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తులపై చర్య తీసుకోవాలి

మంగళారపు శ్రీనివాసరెడ్డి

చొప్పదండి మండల అధ్యక్షుడు

**నీలగిరి వార్త కరీంనగర్ ప్రతినిధి**

**(సతీష్ )**



తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) విగ్రహంపై నల్లగొండలో కొందరు దుండగులు పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటనను తెలుగుదేశం పార్టీ చొప్పదండి మండల అధ్యక్షుడు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్టీఆర్ ను లక్ష్యంగా చేసుకుని జరిగిన ఈ చర్య అత్యంత బాధాకరమని అన్నారు. తెలుగుదేశం పార్టీని రాజకీయంగా ఎదుర్కోలేని వారు ఇటువంటి పిరికిపంద చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ ఘటన వెనుక ఉన్న దుండగులను వెంటనే గుర్తించి, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# సంకెపెల్లి వాగు నుండి ఇసుకకు అధికారులు అనుమతులు ఇవ్వాలి

**నీలగిరి వార్త వేములవాడ ప్రతినిధి**

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారిరాములు రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ లో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి. రాములు మాట్లాడుతూ, వేములవాడ మూలవాగు నుండి ఇసుకకు అధికారులు అనుమతులు ఇస్తున్నారని, ఇసుక తీసే ప్రాంతం రైతుల వ్యవసాయ బావులకు దగ్గరగా ఉండడం తో రైతులు ఆందోళన చెందుతున్నారని, కావున సంకెపెల్లి వాగు నుండి ఇసుకకు అధికారులు అనుమతులు ఇవ్వాలని కోరడమైనది. ఇసుకకు నెలకు ఒకసారో 15 రోజులకు ఒకసారో అనుమతులు ఇవ్వడం తో భవననిర్మాణ కార్మికులు, ఇంటి యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కావున ప్రతిరోజూ ఇసుక, మొరం, మట్టికి అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేయడం జరిగింది. అని రాములు తెలిపారు.





# చెత్తాచెదారంతో మరో డంపింగ్ యార్డును తలపిస్తున్న "హిందూపురి "

**12 ఏళ్లుగా నాలుగు డివిజన్లో చెత్తతో అధ్వానంగా మారిన హిందూ పూరి ప్రాంతం ..**

**మేయర్ కోలగని శ్రీనివాస్,22వ డివిజన్ కార్పొరేటర్ బండ రమణారెడ్డి.**

**నీలగిరి వార్త కరీంనగర్ ప్రతి నిధి (సతీష్ )**

నగరంలోని ఆర్టీసీ వర్క్ షాప్ క్వాటర్స్ ప్రాంతంలోని హిందూ పురి ప్రాంతం గత 12 ఏళ్లుగా తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోంది. దాదాపు నాలుగు డివిజన్లకు సంబంధించిన చెత్తాచెదారాన్ని ఇక్కడే వేస్తుండటంతో, ఈ ప్రాంతం కాస్తా మరో డంపింగ్ యార్డ్గా రూపాంతరం చెందింది. స్థానిక ప్రజలు తీవ్ర దుర్వాసనతో, దోమల బెడదతో నరకయాతన అనుభవిస్తున్నారు. అధికారులు, పాలకులు మారినా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకకపోవడంతో, 22వ బీజేపీ కార్పొరేటర్ బండ రమణారెడ్డి రంగంలోకి దిగారు. 12 ఏళ్ళు నరకప్రాయంగా మారిన ప్రాంతానికి విముక్తి కల్పించడానికి కార్పొరేటర్ బండ రమణారెడ్డి సమస్యను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యపై వెంటనే స్పందించిన మేయర్ కొలగని శ్రీనివాస్ చెత్తను తరలించడానికి తక్షణం చర్యలు చేపట్టాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు.. ప్రధానంగా నాలుగు డివిజన్ల చెత్తను ఇక్కడే అడ్డగోలుగా పారబోస్తుండటంతో చుట్టుపక్కల కాలనీ ప్రజలు ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని స్థానిక బీజేపీ కార్పొరేటర్



బండ రమణారెడ్డి మంగళవారం రోజున ఈ చెత్తను తరలించేందుకు పూనుకున్నారు. తాత్కాలికంగా చెత్తను తరలించడం మాత్రమే కాకుండా, ఇకపై ఇక్కడ నాలుగు డివిజన్ల చెత్తను వేయకుండా మున్సిపల్ అధికారులు శాశ్వత చర్యలు చేపట్టాలని, ఈ ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. చెత్తను తరలించడానికి చర్యలు తీసుకున్న మేయర్ కోలగని శ్రీనివాస్ ,కార్పొరేటర్ బండ రమణారెడ్డి కి చుట్టుపక్కల కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు..

# రుద్రంగి రోడ్డు ప్రమాదంలో గల్ఫ్ కార్మికుడు మృతి

**నీలగిరి వార్త వేములవాడ ప్రతినిధి**

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది బైక్ డివైడర్ను ఢీకొట్టిన ఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. చందుర్తి మండలం కట్ట లింగంపేట గ్రామానికి చెందిన ఎల్లా శ్రీనివాస్ ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశమైన మస్కట్లో పనిచేస్తూ ఇటీవలే స్వదేశానికి వచ్చాడు. మంగళవారం రుద్రంగి మండల కేంద్రంలో తన సామాన్లు తీసుకున్న అనంతరం తిరిగి ద్విచక్ర వాహనంపై స్వగ్రామమైన కట్ట లింగంపేటకు బయలుదేరాడు. ఈ క్రమంలో రుద్రంగి మెయిన్ రోడ్డుపై ఉన్న డివైడర్ను శ్రీనివాస్ ప్రయాణిస్తున్న బైక్ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ తలకు తీవ్ర గాయాలు కావడంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు రుద్రంగి ఎస్సై మోతీరాం తెలిపారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న రుద్రంగి పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వేములవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు శ్రీనివాస్కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ పోషణ కోసం గల్ఫ్ దేశానికి వెళ్లి, ఇటీవలే కళ్లముందుకు వచ్చిన యజమాని ఇలా రోడ్డు ప్రమాదంలో అనంత లోకాలకు వెళ్లడంతో భార్యాపిల్లలు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ ఘటనతో కట్ట లింగంపేట గ్రామంలో తీవ్ర విషాద



ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అవకాశం ఉన్న ప్రతి ప్రాథమిక పాఠశాలకు పూర్వ ప్రాథమిక పాఠశాల మంజూరు చేయాలి

**నీలగిరి వార్త వేములవాడ ప్రతినిధి**

టీపీటీఎఫ్ వేములవాడ అర్బన్ రూరల్ మండల శాఖల విజ్ఞప్తి వేములవాడ మండలంలోని ప్రతి అర్హ పాఠశాలకు పూర్వ ప్రాథమిక పాఠశాల మంజూరు చేయాలి. టీపీటీఎఫ్ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని టీపీటీఎఫ్ వినతి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పూర్వ ప్రాథమిక పాఠశాలల ఏర్పాటు కార్యక్రమంలో వేములవాడ అర్బన్, రూరల్ మండలాలకు ఒక్క పాఠశాల కూడా మంజూరు కాకపోవడం పట్ల టీపీటీఎఫ్ వేములవాడ మండల శాఖలు ఆందోళన వ్యక్తం చేశాయి. అవకాశం ఉన్న ప్రతి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు పూర్వ ప్రాథమిక పాఠశాలను మంజూరు చేయాలని కోరుతూ మండల విద్యాధికారి ద్వారా ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించారు. చిన్నారులకు నాణ్యమైన ప్రాథమిక విద్య అందించాలంటే పూర్వ ప్రాథమిక విద్యను ప్రభుత్వ పాఠశాలల్లో విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. అదేవిధంగా కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదుల మరమ్మతులు, విద్యుత్ సదుపాయం తదితర మౌలిక వసతులను కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు బొజ్జ కృష్ణ, ప్రధాన కార్యదర్శి మహేష్, జిల్లా కార్యదర్శి



రామచంద్రం, రూరల్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి దూస సంతోష్, రవి, లక్ష్మీనారాయణ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదామును తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:**



భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు నిర్వహించే త్రైమాసిక తనిఖీల్లో భాగంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మంగళవారం కలెక్టరేట్ సమీపం లోని ఈవీఎం గోదాంను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాంలో భద్రపరిచిన బ్యాలెట్ యూనిట్లు, ,యంత్రాల భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. గోదాం తాళాల భద్రత, సీసీటీవీ కెమెరాల పనితీరు, అగ్నిమాపక పరికరాలు, భద్రతా సిబ్బంది విధులు, రిజిస్టర్ తదితర అంశాలను తనిఖీ చేశారు. గోదాంలో భద్రపరిచిన యంత్రాల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు, గోదాం ఇన్చార్జ్లు, భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.



# బుధవారంపేట గ్రామంలో వాటర్ ప్లాంట్ పునఃప్రారంభం

**కమాన్ పూర్ నీలగిరి వార్త: జూన్ 9.**

రామగిరి మండలం రామగిరి మండలం బుధవారంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని వాటర్ ప్లాంట్ను పునఃప్రారంభించారు. బుధవారంపేట సర్పంచ్ కన్నూరి రవీందర్, రామగిరి మండల ఎంపీ ఓ సమ్మిరెడ్డి, డిసిసి సెక్రటరీ బుద్ధార్థి బుచ్చన్న పటేల్ గారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్లాంట్ను తిరిగి ప్రారంభించారు. సుమారు పదిహేను సంవత్సరాల క్రితం వరంగల్ డయాసిస్ సాంగిక సేవా సంస్థ మరియు గ్రామస్థుల సహకారంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ యంత్రాంగం ఇటీవల కాలంలో మరమ్మతులకు గురైంది. ఈ నేపథ్యంలో కొత్త మిషనరీని ఏర్పాటు చేసి గ్రామ ప్రజలకు తిరిగి అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. గ్రామ ప్రజలు అందరూ శుద్ధమైన తాగునీటిని వినియోగించుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బుద్ధార్థి విజయ, ఏఎంసి డైరెక్టర్ ఆరేల్లి శ్రీనివాస్ గౌడ్, వార్డు సభ్యులు బావు స్వరూప కత్తెరసాల, బైరెడ్డి అనూష సతీష్, కన్నూరి రాకేష్, పుదరి శ్రీనివాస్, మరుకు చంద్రశేఖర్, కన్నూరి శ్రావణ్, పంచాయతీ కార్యదర్శి చొప్పరి రాకేష్, పెంద్రు సుమంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# రామ సహాయం సురేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన. కాంగ్రెస్ పార్టీ వరంగల్ తూర్పు సీనియర్ నాయకులు.

**వరంగల్ బ్యూరో నీలగిరి వార్త**

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వరంగల్ మాజీ ఎంపీ రామ సహాయం సురేందర్ రెడ్డి మంగళవారం హన్మకొండకు విచ్చేసిన సందర్భంగా వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టీ. పి సి. సి. డెలిగేట్ మెంబర్ నల్గొండ రమేష్, మాజీ కార్పొరేటర్ బస్వరాజు శిరీష – శ్రీమాన్ హన్మకొండ నగరంలోని అశోక హోటల్లో మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయనకు పుష్ప గుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రామ సహాయం సుందర్ రెడ్డి వరంగల్ లో పార్టీ పరిస్థితిని తెలుసుకుని, రాబోయే రోజుల్లో అనుసరించాల్సిన వ్యూహ్యాలను వరంగల్ తూర్పు నాయకులకు వివరించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని మరింత విస్తరింప చేయాలని సూచించారు, ఈ కార్యక్రమం లో వరంగల్ తూర్పు సీనియర్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారని నల్గొండ రమేష్ తెలియజేశా రు.





# టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన.

## రాష్ట్ర అడవి పర్యావరణ దేవాదాయక శాఖ మంత్రి కొండా సురేఖ.

**వరంగల్ బ్యూరో నీలగిరి వార్త**

టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ జన్మదిన సందర్భంగా శాలువాతో సన్మానించి బొకే ఇచ్చి స్వీట్స్ ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ కొండా సురేఖ మరెన్నో జన్మదినాలు జరుపుకోవాలని అన్నారు. హైదరాబాదులోని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ నివాస గృహంలో కలిసిన మీసాల ప్రకాష్ మీసాల ప్రకాష్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



# ఆర్ట్స్ కళాశాలకు లాక్ష్ ఫౌండేషన్‌తో అవగాహన ఒప్పందం.

**వరంగల్ బ్యూరో నీలగిరి వార్త**

కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల విస్తరణ, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ కార్యక్రమాల నిర్వహణ లక్ష్యంగా బెంగళూరుకు చెందిన లాక్ష్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థతో అవగాహన ఒప్పందం (ఎం.ఓ.యు.) కుదుర్చుకుంది. ఈ అవగాహన ఒప్పందాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు ఉపాధి సంబంధిత నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం, డిజిటల్ సామర్థ్యాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించడం నేటి అవసరమని పేర్కొన్నారు. లాక్ష్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాలు, కెరీర్ మార్గదర్శక శిబిరాలు, పరిశ్రమల ఆధారిత అభ్యాస కార్యక్రమాలు, ఇంటర్న్‌షిప్ అవకాశాలు విద్యార్థుల భవిష్యత్‌కు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.డి. రెహమాన్, ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ జితేందర్, తెలంగాణ మేనేజర్ రవికుమార్, డాక్టర్ సాయి చరణ్, డాక్టర్ రమేష్, డాక్టర్ గిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




# ఘన వ్యర్థాల నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం కీలకం.

## కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో అవగాహన వర్క్‌షాప్ నిర్వహణ.

**వరంగల్ బ్యూరో నీలగిరి వార్త**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ -- ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా, హనుమకొండ జిల్లా కలెక్టర్ ఇన్‌చార్జి బల్దియా కమిషనర్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు -- 2026 పై బల్దియా ప్రధాన కార్యాలయ కౌన్సిల్ హాల్ లో మంగళవారం అవగాహన వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ శాస్త్రవేత్త బి. జీమూత వాహన మాట్లాడుతూ, ఘన వ్యర్థాలను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని గణనీయంగా నియంత్రించవచ్చని తెలిపారు. ప్రతి ఇంటి వద్ద ఉత్పత్తి అయ్యే ఘన వ్యర్థాలను తడి, పొడి, గృహ ప్రమాదకర వ్యర్థాలు, శానిటరీ వ్యర్థాలు అనే నాలుగు విభాగాలుగా తప్పనిసరిగా వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని సూచించారు. బల్దియా ముఖ్య వైద్య ఆరోగ్య అధికారి డా. బొమ్మన రాజా రెడ్డి, వైద్య ఆరోగ్య అధికారి డా. రాజేష్, మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఘన వ్యర్థాల నిర్వహణను మరింత పటిష్టంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఏక వినియోగ ప్లాస్టిక్




వస్తువులకు బదులుగా సహజసిద్ధమైన, పర్యావరణహిత ఉత్పత్తులను వినియోగించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రమైన పరిసరాల నిర్మాణం, సుస్థిర వ్యర్థాల నిర్వహణపై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించడమే ఈ వర్క్‌షాప్ ప్రధాన ఉద్దేశ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 250 మంది మున్సిపల్ సిబ్బంది, వార్డ్ జవాన్లు, స్వచ్ఛ భారత్ మిషన్ సిబ్బంది, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్స్ (ఆర్‌డబ్ల్యూఏలు) ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉత్తమ్ దంపతుల పై నిరాధారణమైన ఆరోపణలు చేసినందుకు ఫిర్యాదు....

## కాంగ్రెస్ నాయకులు రావెళ్ల కృష్ణారావు, పిల్లుట్ల శ్రీనివాస్..

**నీలగిరి వార్తతి సూర్యాపేట జిల్లా :**

తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే ఉత్తమ పద్మావతి రెడ్డిలపై నిరాధారమైన ఆరోపణలు చేసినందుకు మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ పై కాంగ్రెస్ నాయకులు రావెల్ల కృష్ణారావు, పిల్లుట్ల శ్రీనివాస్, లు స్థానిక డిఎస్పీకి ఫిర్యాదు కి చేశారు. మంగళవారం కోదాడ డిఎస్పి కార్యాలయంలో డి.ఎస్.పి శ్రీనివాస్ రెడ్డికి ఫిర్యాదు చేసి అనంతరం మాట్లాడారు. హుజూర్నగర్, కోదాడ నియోజకవర్గాలలో వేలాదికోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తుంటే, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ రాజకీయ లబ్ధి కోసం నిరాధారమైన ఆరోపణ చేయటం సరైనది కాదన్నారు. అవినీతి ఆరోపణల పై ఆధారాలు ఉంటే సంబంధిత అవినీతి నిరోధక శాఖలకు ఫిర్యాదు చేయాలి, లేదా ప్రజాక్షేత్రంలో ఆధారాలను బహిర్గతం చేయాలి తప్ప, స్థానిక ఎమ్మెల్యేను, అధికారులను, కించపరిచే విధంగా వారిపై అవినీతి ఆరోపణలు చేయటం మానుకోవాలని హెచ్చరించారు. రాజకీయ లబ్ధి కోసం కోదాడ నియోజకవర్గంలోని ప్రభుత్ అధికారులను, అధికారపక్ష నాయకుల పై నిరాధారమైన ఆరోపణలు చేసి రాజకీయ లబ్ధి చేకూరాలని ప్రయత్నించడం హేమమైన చర్యని అన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయ నాయకులు ఆధారాలు లేకుండా ఎవరి పై ఆరోపణలు చేయరాదని, అన్ని రాజకీయ పక్షాలకు విజ్ఞప్తి చేశారు. సరైన ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఫిర్యాదు అందజేసిన వారిలో మైలారి శెట్టి భాస్కర్, పాలడుగు సంజీవ్, షరీఫ్, బాగ్దాద్, కామల్ల ప్రవీణ్, పిడతలు శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.



# ఎల్లమ్మ దేవాలయ బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ జూన్ 09నీలగిరి వార్త**

కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 4వ డివిజన్ దుర్షేడ్ శివారులో గల ఎల్లమ్మ దేవాలయంలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజల సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు అనంతరం మల్లన్న దేవాలయం నుండి ఎల్లమ్మ దేవాలయం వరకు ఏర్పాటు చేసిన నూతన స్ట్రీట్ లైట్లను మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే నగరపాలక సంస్థ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో 4వ డివిజన్ కార్పొరేటర్ భూపతి రవీందర్, స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు, భక్తులు స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# దుబాయిలో ఎమిరేట్స్ రహదారిపై రోడ్డు ప్రమాదం

## ముగ్గురు జగిత్యాల జిల్లా వాసులు మృతి.

**జగిత్యాల జిల్లా ప్రతినిధి :నీలగిరి వార్త జూన్ 09 :**



దుబాయిలో అత్యంత రద్దీగా ఉండే ఎమిరేట్స్ రహదారిపై జరిగిన ప్రమాదంలో 7 గురు మరణించారు. వీరిలో ముగ్గురు తెలంగాణ ప్రవాసీయులు ఉన్నారు. క్షతగాత్రుల్లో నలుగురికి సాధారణ వార్డులో చికిత్స అందిస్తుండగా వీరిలో హైదరాబాద్‌కు చెందిన మొహమ్మద్ సయీద్ కూడా ఉన్నారు. మృతులు ముగ్గురూ కూడా జగిత్యాల జిల్లాకు చెందిన వారేనని ప్రాథమిక సమాచారం. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని నమిలికొండ గ్రామానికి చెందిన సయ్యద్ సలీం (51), మల్యాల మండలం తక్కళ్ళపల్లి గ్రామానికి చెందిన గొల్లపలి తిరుపతి గౌడ్ (42), మెట్ పల్లి మండల కేంద్రంలోని గాజులపేటకు చెందిన అబ్దుల్ రఫీఖ్ (37)లు ఈ ప్రమాదంలో మరణించారు. మృత దేహాలను భారత్‌కు పంపించడానికి దుబాయిలోని భారతీయ కాన్సులేటు అధికారులు మృతుల కుటుంబాలతో సంప్రదింపులు జరుపుతున్నారు., షార్జా కేంద్రంగా ఉన్న ఒక అల్యూమినియం డోర్ ఫ్రేం, గ్లాసుల పరిశ్రమలో వీరందరు పని చేస్తున్నారని తెలిసింది. అకస్మాత్తుగా సాంకేతిక లోపంతో రోడ్డుపై ఆగిపోయిన లారీని వెనక నుంచి వచ్చి మినీ బస్సు ఢీకొనడంతో ఈ దుర్ఘటన జరిగినట్లు సమాచారం.

# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

## - బాలికల రక్షణ కొరకు ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేశాం

## - కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ అలం

**హుజూరాబాద్ రూరల్, జూన్ 09, నీలగిరి వార్త**

సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ అలం అన్నారు. మంగళవారం స్థానిక ఏసీపి కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సైబర్ నేరాల బారిన పడ్డ వ్యక్తులు సుమారు గంట లోపు 1902 టోల్ ఫ్రీ ద్వారా ఫిర్యాదు చేస్తే అమౌంట్ ఫ్రీజ్ చేయడం జరుగుతుందని, ఆలస్యం చేస్తే డబ్బులను తిరిగి రావడం కష్టమని తెలిపారు. సిసిటిఎన్ఎస్ 2.0, ఈ సాక్ష్ పోలీసులకు అవగాహన కల్పించామని తెలిపారు. ఇటీవల కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగిన దొంగతనాన్ని దృష్టిలో ఉంచుకొని బ్యాంక్లు, బంగారం దుకాణాలకు రక్షణ కోసం ఎలాంటి చర్యలు చేపట్టాలో తెలిపామని, సిసి కెమెరాలను అన్ని వ్యాపార సంస్థలు సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. వాహనాల తనిఖీలు, మాదక ద్రవ్యాల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టాలని విషయాలను వివరించడం జరిగిందన్నారు. మాదకద్రవ్యాలను తీసుకునే వారిని టెస్ట్ కిట్ల ద్వారా పరీక్షించి ఒకవేళ మాదవద్రవ్యాలు తీసుకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాలికల రక్షణ కోసం పాఠశాలల్లో ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేయడంజరిగిందన్నారు. ప్రతి పాఠశాలకు ఒక్క మహిళ పోలీస్ కానిస్టేబుల్ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. హుజూరాబాద్ డివిజన్ పోలీసుల పనితీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఏసీపి కార్యాలయ ఆవరణలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ ఏసీపి వాసంశెట్టి మాధవి, సిఐలు కరుణాకర్, శ్రీనివాస్, రామకృష్ణ, వెంకట్, ఎస్ఐలు స్వాతి, తిరుపతి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





Printed, Published and Owned by GUNTOJ VISHNU MURTHY, Printed at V.M. PRINTERS Plot No. 08, Shiva Shankar Colony, Kuntloor, (V) Abdulpurmet (M), Ranga Reddy District, Telangana. Published at V.M. PUBLICATIONS Plot No. 08, Shiva Shankar Colony, Kuntloor, (V) Abdulpurmet (M), Ranga Reddy District, Telangana State. Pin:501505, Editor, GUNTOJ VISHNU MURTHY, RNI NO: APTEL/31957/2009:Cell No:

# హనుమకొండ ట్రాఫిక్ సీఐ బాధ్యతల స్వీకరణ.

**వరంగల్ బ్యూరో నీలగిరి వార్త**

వరంగల్ పోలీస్ కమిషనర్ ఉత్తర్వుల మేరకు హనుమకొండ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ గా ప్రవీణ్ కుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమకొండ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ట్రాఫిక్ అధికారులు, సిబ్బంది నూతన ఇన్స్పెక్టర్ కు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.



# స్ట్రీట్ ఫుడ్ హబ్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక దృష్టి.

## కేంద్ర పట్టణాభివృద్ధి శాఖతో జీడబ్ల్యూఎంసీ అధికారుల వీడియో కాన్ఫరెన్స్.

**వరంగల్ బ్యూరో నీలగిరి వార్త**

కేంద్ర ప్రభుత్వ గృహనిర్మాణ మరియు పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (వీఱఅఱర్‌తీఎ శీట ఎశీబంఱఅస్త్ర ఖఅస ఖతీఝఱఅాటటఝఱఅతీం) జాయింట్ డైరెక్టర్ శ్రీమతి ఈషా కిరణ్ మంగళవారం స్వయం సహాయక సంఘాలు, స్ట్రీట్ ఫుడ్ అభివృద్ధి కార్యక్రమాలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) అధికారులు ప్రధాన కార్యాలయంలో ని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి అదనపు కమిషనర్ ఇసంపల్లి జోనా, అదనపు ఉప కమిషనర్ సమ్మయ్య, సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్, మెప్మా సిటీ మిషన్ కోఆర్డినేటర్ రమేష్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ డైరెక్టర్ ఈషా కిరణ్ మాట్లాడుతూ, కేంద్ర పట్టణ జీవనోపాధి మిషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఐదు పట్టణ స్థానిక సంస్థలను స్ట్రీట్ ఫుడ్ హబ్‌ల అభివృద్ధికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన సంస్థలకు స్ట్రీట్ ఫుడ్ హబ్‌ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక రూ 4 కోట్ల నిధులను మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్, సైబరాబాద్ ప్రాంతంలోని స్థానిక సంస్థ, ధర్మపురి మరియు వేములవాడ మున్సిపాలిటీలు ఈ కార్యక్రమానికి ఎంపికయ్యాయి. జిల్లా కలెక్టర్ జీడబ్ల్యూఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ మార్గదర్శకత్వంలో రూపొందించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను జీడబ్ల్యూఎంసీ అధికారులు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ అధికారులకు వివరించారు. ప్రతిపాదిత స్ట్రీట్ ఫుడ్ హబ్‌కు సంబంధించిన నమూనా డిజైన్లు, ఫోటోలు, వీడియోలను ప్రదర్శిస్తూ ప్రాజెక్టు ప్రత్యేకతలను వివరించారు. స్ట్రీట్ ఫుడ్ హబ్ ఏర్పాటుకు ప్రతిపాదించిన ప్రాంతాన్ని పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వ అధికారుల బృందం వచ్చే వారం వరంగల్‌లో పర్యటించనున్నట్లు సమావేశంలో వెల్లడించారు.

నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహార సేవలతో పాటు వీధి వ్యాపారులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడమే ఈ స్ట్రీట్ ఫుడ్ హబ్‌ల ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు.





# డబుల్ బెడ్‌రూమ్, ఇందిరమ్మ ఇళ్ల సమస్యల పరిష్కారానికి హెల్ప్ డెస్క్

**కరీంనగర్ జూన్ 09నీలగిరి వార్త**

కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలు ఎదుట డబుల్ బెడ్‌రూమ్, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం మంగళవారం హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. ప్రజలు తమ సమస్యలను ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు హెల్ప్ డెస్క్‌లో తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో సుధాకర్, గృహ నిర్మాణశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇస్రో సందర్శనకు ఖని విద్యార్థి రిశ్విక్

## --ఇస్రో చైర్మన్ ను కలిసే అవకాశం

## --ఈ నెల 12న నేషనల్ టాపర్స్ అవార్డ్ సెరెమనీ

**నీలగిరి వార్త గోదావరిఖని:**



బెంగళూరులోని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)ను సందర్శించడానికి, నేషనల్ టాపర్స్ అవార్డ్ సెరెమనీలో పాల్గొనడానికి స్థానిక కృష్ణవేణి స్కూల్ విద్యార్థి రాకం రిశ్విక్ కు ఆహ్వానం అందింది. అంతర్జాతీయ సంస్థ ఇస్కాన్ గత ఫిబ్రవరి 3న ఆన్లైన్ లో నిర్వహించిన ప్రపంచ స్థాయి 'భగవద్గీత వాల్యూ ఎడ్యుకేషన్ కాంటెస్ట్'లో స్థానిక కృష్ణవేణి స్కూల్ విద్యార్థి రాకం రిశ్విక్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానాన్ని సాధించి ప్రశంసలందుకున్నాడు. జిల్లా వ్యాప్తంగా వందలాది మంది విద్యార్థులు ఈ కాంటెస్ట్ లో పాల్గొనగా.. 95 శాతం కంటే అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు జూమ్ ద్వారా ఇంటర్వ్యూ నిర్వహించి జిల్లా స్థాయి ప్రతిభావంతులను ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో గోదావరిఖని తిలక్ నగర్ కు చెందిన రాకం కిరణ్–శ్వేత దంపతుల కుమారుడు, కృష్ణవేణి స్కూల్స్ లో ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్న రాకం రిశ్విక్ జిల్లా స్థాయి సెకండ్ టాపర్ గా నిలిచి తన ప్రతిభను చాటాడు. ఇస్కాన్ సంస్థ ప్రతినిధి ప్రేమ్ రాజ్ చైతన్య, రిశ్విక్ కు బహుమతిగా సైకిల్ తో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేసి అభినందించారు. ఈ నెల 12న బెంగళూరులోని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)ను సందర్శించడానికి, నేషనల్ టాపర్స్ అవార్డ్ సెరెమనీలో పాల్గొనడానికి ఆహ్వానం పంపారు. ఇస్రో చైర్మన్, ఏరో నాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఎస్.సోమనాథ్ ను కలిసే అవకాశంతో పాటు ఆయనతో గ్రూప్ ఫోటో, డమ్మీ రాకెట్ లాంచింగ్ డెమోను తిలకించడానికి తల్లిదండ్రులతో కలిసి రిశ్విక్ బెంగళూరు బయలుదేరి వెళ్ళాడు. కాగా తమ పాఠశాల విద్యార్థి రిశ్విక్ ఇస్రో సందర్శనకు ఎంపిక కావడంపట్ల పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస రెడ్డి, కరస్పాండెంట్ మంజులా శ్రీనివాస్ రెడ్డి, క్యాంపస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

# ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పగడ్బందీగా నిర్వహించాలి

## జిల్లా అదనపు కలెక్టర్ రాములు

**నీలగిరి వార్త మంచిర్యాల :**

జూన్ 25వ తేదీ నుంచి చేపట్టనున్న ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ వి. రాములు అన్నారు. జిల్లాలోని హాజీపూర్ భీమారం జైపూర్ మండల తహసిల్దార్ కార్యాలయాలను బి సెక్షన్ సూపరింటెండెంట్ మధుసూదన్ తో కలిసి సందర్శించి సిబ్బందితో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం సాదా బైనామా దరఖాస్తులు భూభారతి పెండింగ్ దరఖాస్తుల పరిష్కరణ సంబంధిత అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 3వ విడత సర్ లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా జూన్ 25 వ తేదీ నుంచి నిర్వహించనున్న ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాటులకు తావు లేకుండా సక్రమంగా నిర్వహించాలని బూతు స్థాయి అధికారులు ప్రతి ఇంటికి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సూపర్వైజర్లు ఏఈఆర్వోలు పనుల పురోగతిని పరిశీలించాలని తెలిపారు. ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం భూ భారతి పోర్టల్ ను అందుబాటులోని తీసుకువచ్చి ప్రజల యొక్క ప్రతి సమస్యను పరిష్కరించడం జరుగుతుందని ఈ క్రమంలో పెండింగ్ లో ఉన్న దరఖాస్తుల పరిష్కరణ వేగవంతం చేయాలని సాదా బైనామా దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేసి క్షుణ్ణంగా పరిశీలించి ఆమోదించాలని తెలిపారు. కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని కార్యాలయానికి వచ్చే ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని సర్టిఫికెట్లను నిబంధనలకు లోబడి నిర్ణీత గడువులోగా జారీ చేయాలని తెలిపారు.



# బిర్సా ముండా వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించిన మంత్రి సీతక్క సుగుణక్క

**నీలగిరి వార్త ఆసిఫాబాద్ 09 జూన్ 2026**

హైదరాబాద్: గిరిజనుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహనీయుడు, స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో ఆయన చిత్రపటానికి రాష్ట్ర మంత్రి సీతక్కతో కలిసి కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క నివాళులర్పించారు. ఈ సందర్భంగా బిర్సా ముండా గిరిజనుల హక్కుల సాధన కోసం చేసిన త్యాగాలు, పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు. గిరిజన సమాజ అభ్యున్నతికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాలు నేటి తరాలకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. గి తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి, మార్లవాయి సర్పంచ్ కనక ప్రతిభ, ఇందిరా ఫెల్లోషిప్ జిల్లా సమన్వయకర్త కోవ ఇందిర, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# డిజిఎం కంభం వెంకట రమణారెడ్డి గారికి ఘన వీడ్కోలు సన్మానం

**కమాన్ పూర్ నీలగిరి వార్త జూన్ 9.**

సింగరేణి ఆర్జీ–3, ఓసీ–1 గనిలో గత 19 సంవత్సరాలుగా డిప్యూటీ జనరల్ మేనేజర్ (ఎస్ఎంఎంసి)గా విధులు నిర్వహించిన కంభం వెంకట రమణారెడ్డి బదిలీపై ఆర్జీ–1 ఏరియా, జీడీకే కోల్ మైన్ ఓసీకి వెళ్తున్నారు. ఈ సందర్భంగా గని సిబ్బంది, సహోద్యోగులు ఆయనకు ఘనంగా వీడ్కోలు సన్మానం చేశారు. శాలువా, కండువాతో సత్కరించి స్వీట్ తినిపించారు. 19 ఏళ్ల సుదీర్ఘ సేవలో రమణారెడ్డి గారు చూపిన మంచితనం, సహాయ గుణం, సమస్యలను చాకచక్యంగా పరిష్కరించే చురుకైన ఆలోచనా విధానాన్ని అందరూ గుర్తు చేసుకున్నారు. ఎవరితోనైనా కలిసిమెలిసి, సులభంగా పనిచేయించుకునే ఆయన మానవత్వాన్ని అభినందించారు. బదిలీ అయిన గనిలోనూ మరింత మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు, కృతజ్ఞతలు తెలిపారు. గని మేనేజర్ రావుల పాపయ్య సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో బ్లాస్టింగ్ ఇన్‌ఛార్జ్ జనార్ధన్, డిజిఎం అమియా కుమార్ కుందు, హెడ్ ఓవర్‌మెన్లు డి. తిరుపతిరావు, భీమాని సంపత్, మోత్కూరి సాంబయ్య, రామకృష్ణ, డి. ప్రవీణ్, సర్వే చైన్మెన్ కొలిపాక సారయ్య, నామని మార్కండేయ, పాతకాల రాజారాం, తదితరులు పాల్గొన్నారు.



# సీతారాంపూర్ 23వ డివిజన్‌లో విద్యుత్ తీగల సమస్య పరిష్కారానికి కార్పొరేటర్ గుమ్మడి రాజ్‌కుమార్

**కరీంనగర్ జూన్ 09నీలగిరి వార్త**

సీతారాంపూర్ 23వ డివిజన్ పరిధిలోని పంట పొలాల వద్ద విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ రైతులకు ప్రమాదకరంగా మారిన సమస్యను గుర్తించిన కార్పొరేటర్ గుమ్మడి రాజ్‌కుమార్ వెంటనే స్పందించారు. ఈ విషయాన్ని సంబంధిత విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టేలా కృషి చేశారు. రైతుల భద్రతను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ తీగలు వాలిపోకుండా ఉండేందుకు మధ్యలో అదనపు విద్యుత్ స్తంభం (పోల్) ఏర్పాటు చేయడంతో పాటు, తీగలను సక్రమంగా బిగించి అవసరమైన మరమ్మతు పనులు పూర్తి చేశారు. ఈ చర్యలతో ప్రమాదం తొలగి రైతులకు భద్రత కలగడంతో వారు కార్పొరేటర్ గుమ్మడి రాజ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ అభినందించారు. స్థానిక ప్రజల సమస్యల పరిష్కారానికి ఆయన చూపుతున్న చొరవ ప్రశంసనీయమని రైతులు పేర్కొన్నారు.



# ఈ వీ ఎం గోదాంను తనఖీ చేసిన జిల్లా కలెక్టర్...

**జయశంకర్ భూపాలపల్లి.జూన్ 9,నీలగిరి వార్త**

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ మంగళవారం జిల్లా కేంద్రంలోని ఈవిఎం, వివి ఫ్యాట్ గోదామును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాంలో భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లు మరియు వీవీపాట్ యంత్రాల భద్రతను పరిశీలించారు. గోదాంలో అమలు చేస్తున్న భద్రతా చర్యలు, సీసీటీవీ పర్యవేక్షణ, అగ్నిమాపక పరికరాలు, డబుల్ లాక్ సిస్టమ్ తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. అలాగే, యంత్రాల నిర్వహణ రికార్డులు, స్ట్రాంగ్ రూమ్ రిజిస్టర్లను తనిఖీ చేసి, ఎన్నికల సంగం సూచించిన నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత మరియు నిష్పాక్షికత కోసం ఈవిఎంల, వివి ఫ్యాట్ ల భద్రత అత్యంత కీలకమని ఎన్నికల సంగం ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి తనిఖీ చేయనున్నామని తెలిపారు. గోదాంలో ఉన్న అన్ని యంత్రాలు సక్రమంగా భద్రపరచబడి ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. అనంతరం తనిఖీ రిజిస్టర్ లో సంతకాలు చేసి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తాళం వేసి సీల్ వేశారు. ఈ తనిఖీలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు అబ్బాస్, నవీన్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# పూరి గుడిసె లేని జిల్లాగా తీర్చిదిద్దాలి





**పూరిగుడిసెల్లో నివసిస్తున్న అర్హులను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలి**

**జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**


**కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:**

జిల్లాలో ఒక్క పూరిగుడిసె కూడా లేకుండా "పూరిగుడిసెలు లేని జిల్లాగా" కామారెడ్డిని తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సూచించారు. రామారెడ్డి మండలంలోని వడ్డెర కాలనీ సందర్శించి పూరిగుడిసెల్లో నివసిస్తున్న అర్హులైన కుటుంబాలను గుర్తించి వారికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల పరిధిలో పర్యటించిన సందర్భంగా పూరిగుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాల పరిస్థితిని పరిశీలించిన జిల్లా కలెక్టర్, గృహ సౌకర్యం లేని అర్హుల వివరాలను క్షేత్రస్థాయిలో సేకరించి ప్రభుత్వ నిబంధనల మేరకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి పూరి గుడిసెలో ఉన్నవారిని గుర్తించి వారికి ఇళ్లు మంజూరు చేయాలని, పేమెంట్ సమస్యలు తలెత్తితే ఏ పి ఎం ద్వారా ఋణాలు మంజూరు చేయాలని అన్నారు. నిజమైన లబ్ధిదారులను గుర్తించడంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా గ్రామస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించాలని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబం ప్రభుత్వ గృహ పథకాల ప్రయోజనం పొందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పనులు వేగవంతం చేయాలని, లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక, పరిపాలనా సహకారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిడి హౌసింగ్ విజయపాల్ రెడ్డి, ఎమ్మార్వో, సర్పంచ్ బండి ప్రవీణ్, ఎంపీడీవో నాగేశ్వర్ రావ్, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణయే లక్ష్యంగా వాహనాల తనిఖీలు.

**నీలగిరి వార్త వేములవాడ ప్రతినిధి**

అసాంఘిక శక్తులు, అనుమానిత వ్యక్తుల కట్టడికే జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు. సిరిసిల్ల ఎల్లమ్మ సర్కిల్ వద్ద తనిఖీల్లో పాల్గొన్న జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా మంగళవారం సాయంత్రం సిరిసిల్ల పట్టణంలోని ఎల్లమ్మ సర్కిల్ వద్ద నిర్వహించిన వాహనాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీల్లో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పాల్గొని క్షేత్రస్థాయిలో తనిఖీలను పర్యవేక్షించారు. ఈసందర్భంగా విధుల్లో ఉన్న అధికారులకు, సిబ్బందికి అనుమానాస్పదంగా కనిపించే వ్యక్తుల వివరాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, వాహనాల డాక్యుమెంట్లు పరిశీలించాలని సూచించారు. సరైన పత్రాలు లేని వాహనాలు, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నెంబర్ ప్లేట్లు కలిగిన వాహనాలను సీజ్ చేయాలని, మైనర్లు వాహనాలు నడుపుతున్నట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.... ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించడమే జిల్లా పోలీసుల ప్రధాన లక్ష్యమన్నారు. ట్రాఫిక్ నిబంధనలను ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీటు బెల్ట్ వినియోగించాలని, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అసాంఘిక శక్తులు, అనుమానిత వ్యక్తుల కట్టడి మరియు నేరాల నివారణ కోసమే జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ తనిఖీలకు ప్రజలందరూ సహకరించాలని ఎస్పీ కోరారు. ఎస్పీ వెంట ట్రాఫిక్ ఆర్ ఎస్ఐ శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.



# అడ్మిషన్ పొందిన విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ





**జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:**

జిల్లాలో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచడం, ప్రతి చిన్నారికి విద్యను అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యంగా నిర్వహిస్తున్న బడి బాట కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పాల్గొన్నారు. మంగళవారం రామారెడ్డి మండలంలోని ఎస్సీ కాలనీ లో నిర్వహించిన బడి బాట కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి, ఇంటింటి ప్రచారం ద్వారా పాఠశాల వయస్సు కలిగిన పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నాలుగు సంవత్సరాలు పూర్తి చేసిన చిన్నారులకు ప్రీ-ప్రైమరీ తరగతుల్లో, అలాగే ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో అడ్మిషన్లు నమోదు చేయడం జరిగింది. ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్న విద్యార్థులను కూడా గుర్తించి నమోదు చేపట్టడం జరిగిందని అన్నారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో జిల్లా కలెక్టర్ సమావేశమై ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. పాఠశాల వయస్సు కలిగిన ప్రతి చిన్నారి తప్పనిసరిగా పాఠశాలలో చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.
అలాగే డ్రాప్అవుట్ విద్యార్థులను గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా అడ్మిషన్ పొందిన విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులను పంపిణీ చేశారు. విద్యార్థులు తమ జీవిత లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. విద్యే సమాజాభివృద్ధికి పునాదిగానిలుస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, మధ్యాహ్న భోజన పథకం, త్వరలో ప్రారంభం కానున్న అల్పాహార పథకం, డిజిటల్ విద్యా సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపించి వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కామారెడ్డి రైల్వే స్టేషన్‌లో భారీగా గంజాయి పట్టివేత

**ఇద్దరు నిందితుల అరెస్ట్**

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:**

కామారెడ్డి జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి బి. హన్మంతరావు ఆదేశాల మేరకు, మంగళవారం కామారెడ్డి ఎక్సైజ్ స్టేషన్ అధికారులు రైల్వే స్టేషన్‌లో ముమ్మర తనిఖీలు చేపట్టారు. సంబల్పూర్ నుండి నాందేడ్ వెళ్లే 'నాగవలి ఎక్స్‌ప్రెస్' (ట్రైన్ నంబర్: 20809) లో తనిఖీలు చేస్తుండగా.. ఇద్దరు అనుమానాస్పద వ్యక్తులు పట్టుబడ్డారు. వారిని తనిఖీ చేయగా వారి వద్ద నుండి 10 కిలోల ఎండు గంజాయి లభ్యమైంది. నిందితులు మహారాష్ట్రలోని జాల్నా జిల్లాకు చెందిన సునీల్ మరియు ప్రవీణ్. నిందితులు ఒడిశాలోని రాయగడలో ఈ ఎండు గంజాయిని కొనుగోలు చేసి, మహారాష్ట్రకు తరలిస్తుండగా పట్టుబడినట్లు కామారెడ్డి ఎక్సైజ్ సీఐ సంపత్ కృష్ణ తెలిపారు. నిందితులిద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ విజయవంతమైన తనిఖీలలో ఎక్సైజ్ సీఐ సి. హెచ్. సంపత్ కృష్ణ, ఎస్ఐ ఎం. విక్రమ్ కుమార్, హెడ్ కానిస్టేబుళ్లు జాన్, బలవంతరావు, ఫరూఖ్ మరియు సిబ్బంది రాజు, పవన్ రెడ్డి, బాబు, శరత్, వందన తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలకు వర్షాకాలంలో వ్యాపించే వ్యాధులపై అవగాహన కల్పించాలి

**ముందస్తుగా లోతట్టు ప్రాంతాలను గుర్తించాలి**

**జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**

**జగిత్యాల జిల్లా ప్రతినిధి నీలగిరి వార్త జూన్ 09 :**

వర్షాకాలం నేపథ్యంలో అన్ని శాఖల అధికారులతో మంగళవారం జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులను జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశించారు. వర్షాకాలంలో నీటి నిల్వల కారణంగా దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు ముందస్తుగా ఆయిల్ బాల్స్, ఫాగింగ్, యాంటీ లార్వ స్ప్రేలు నిర్వహించాలని సూచించారు. ప్రజలు కూడా తమ ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని, ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. భారీ వర్షాలు కురిసే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని లోతట్టు ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అక్కడి ముందస్తుగా ప్రజలను అప్రమత్తం చేయాలని సంబంధిత మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అవసరమైన పరిస్థితుల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. పునరావాస కేంద్రాలుగా ఫంక్షన్ హాల్స్, పాఠశాల భవనాలు తదితర సౌకర్యవంతమైన ప్రదేశాలను గుర్తించి అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. వర్షాకాలంలో నదులు, కాలువలు, చెరువులు, కుంటల సమీప ప్రాంతాల్లో ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని, ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా ఉండేందుకు అవగాహన కల్పించాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ సమా వేశంలో సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ అధికారులు, పాల్గొన్నారు.




# అంగరంగ వైభవంగా శ్రీ కల్కి భగవతి భగవానుల కళ్యాణ మహోత్సవం

**పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు**

**500 ల మందికి అన్న ప్రసాద వితరణ**

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:**

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని శ్రీ కల్కి ఆలయంలో శ్రీ కల్కి భగవతి భగవానుల కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం జరిగింది, కళ్యాణ కార్యక్రమం అనంతరం అన్నప్రసాద వితరణ చేయడం జరిగింది. 500 ల మంది ప్రసాదాన్ని స్వీకరించి అమ్మ భగవానుల ఆశీర్వాదాన్ని స్వీకరించడం జరిగింది, అన్న ప్రసాద వితరణ, కళ్యాణ కార్యక్రమాలకు సహకరించిన దాతలకు ఆశీర్వచనాన్ని అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ సేవకులు ఎర్రం చంద్రశేఖర్, ఎర్రం విజయ్, డాక్టర్ బాలు, సిద్ధంశెట్టి శ్రీనివాస్, పార్శి శ్రీనివాస్, పాత స్వరూప, పప్పుల రాజు శ్రావణి, పబ్బ స్వప్న వేణు, ఎర్రం ప్రసన్న, నాగరాణి, కొమిరిశెట్టి దిగంబర్ పావన, కస్వ వెంకటేష్, శనిశెట్టి శ్రీనివాస్ పద్మ, ఎల్లంకి సుదర్శన్, నంగునూరి కాశీనాథం, జైపాల్ రెడ్డి, లక్ష్మీ రాజం, దోమకొండ శ్రీనివాస్, కళ్ళెం సత్యం, కుంభాల లక్ష్మణ్ యాదవ్ లు పాల్గొనడం జరిగింది.



# జేత్వాన్ బుద్ధ విహార్‌లో బిర్సా ముండా 126వ వర్ధంతి

**నీలగిరి వార్త ఆసిఫాబాద్ 09 జూన్ 2026**

భారతీయ ఆదివాసీ స్వాతంత్ర్య సమరయోధుడు, గిరిజన మన్యం వీరుడు బిర్సా ముండా 126వ వర్ధంతిని బౌద్ధ మత గురువు భంతే భరద్వాజ్ ఆధ్వర్యంలో మంగళవారం వాంకిడి మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భారతీయ బౌద్ధ మహా సభ జిల్లా అధ్యక్షులు డాక్టర్ అశోక్ మహుల్కర్ మాట్లాడుతూ 19వ శతాబ్దపు చివరి రోజుల్లో, నేటి బీహార్, జార్ఖండ్ అటవీ ప్రాంతాల్లో బ్రిటిష్ కాలంలో జరిగిన సహస్రాబ్ది ఉద్యమానికి బిర్సా ముండా సారథ్యం వహించారని తెలిపారు. ముండా జాతికి స్వర్ణ యుగం వస్తుందని నమ్మిన వ్యక్తి అని, 22 ఏళ్ల వయసులోనే 1897లో బ్రిటిష్ వారిపై యఁలో ఈయన చిత్రపటాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని అన్నారు. ఈ విధంగా సత్కరింపబడిన ఏకైక గిరిజన నాయకుడు బిర్సా ముండా అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక దళ్ జిల్లా నిర్వాహకులు రోషన్ ఉప్రే, సమాజ అధ్యక్షులు శ్యామ్ రావు, లాహుజి దుర్గే, బుద్ధ ఉపాసకులు పాండుజి జాడే, రమేష్, మారుతి, భిక్షపతి, సురేష్, మోతిరాం తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలో "రక్తపింజార"లాంటి అధికారులు...!

### కార్మికుల ప్రాణాలకు భరోసా ఏది..?

### సమస్యలను ఎవరికి వినిపించాలి..?

### సింగరేణి కార్మికుల ప్రాణాలకు భరోసా కల్పించడంలో యాజమాన్యం విఫలం

### వృద్ధురాలు మృతికి స్థానిక సింగరేణి అధికారులే బాధ్యత వహించాలి

### మాజీ జెడ్పిటీసీ పాల్వంచ దుర్గ ఆగ్రహం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి నీలగిరి వార్త: జూన్ : 09

సింగరేణి సంస్థను దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బొగ్గు సంస్థల్లో ఒకటిగా చెప్పుకుంటున్నప్పటికీ, మణుగూరు ఏరియాలో కొందరు అధికారులు "రక్తపింజార"లా వ్యవహరిస్తూ కార్మిక కుటుంబాల సమస్యలను పూర్తిగా విస్మరిస్తున్నారని మాజీ జెడ్పిటీసీ పాల్వంచ దుర్గ తీవ్ర స్థాయిలో విమర్శించారు. మంగళవారం విలేకరులతో మాట్లాడిన ఆమె, సింగరేణి కార్మిక కాలనీల్లో నెలకొన్న సమస్యలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ఎన్నిసార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ స్థానిక అధికారులు స్పందించకపోవడం దురదృష్టకరమని అన్నారు. మణుగూరు ఏరియా పరిధిలోని పీవీ కాలనీలో కార్మికులు నివసిస్తున్న ప్రాంతాలకు సరైన ప్రహరీ గోడ లేకపోవడం వల్ల పాములు, పందు లు, ఆవులు, గేదెలు వంటి జంతువులు తరచూ కాలనీల్లోకి ప్రవేశిస్తున్నాయని ఆమె తెలిపారు. ఈ సమస్యపై పలుమార్లు సింగరేణి జీఎం దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని విమర్శించారు. కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనలో సింగరేణి అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆరోపించిన దుర్గ, కాలం చెల్లిన క్వార్టర్లు శిథిలావస్థకు చేరుకుని కార్మికుల ప్రాణాలకు ముప్పుగా మారాయని పేర్కొన్నారు. సరైన నిర్వహణ లేకపోవడంతో పశువులు స్వేచ్ఛగా సంచరిస్తూ కార్మిక కాలనీలను అడ్డాలుగా మార్చుకున్నాయని ఎద్దేవ చేశారు. మంగళవారం పీవీ కాలనీలో ఆవు పొడవడంతో ఓ వృద్ధురాలు మృతి చెందడం అత్యంత బాధాకరమని పేర్కొన్న ఆమె, ఈ ఘటనకు స్థానిక సింగరేణి అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. సమస్యలను ముందుగానే గుర్తించి తగిన చర్యలు తీసుకుని ఉంటే ఈ విషాదాన్ని నివారించవచ్చని అభిప్రాయ పడ్డారు. కార్మికుల ప్రాణాలు, వారి కుటుంబాల భద్రత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై బాధ్యత నిర్ధారించాలని, వృద్ధురాలి మృతిపై ఉన్నతస్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. బొగ్గు ఉత్పత్తికి తమ జీవితాలను అంకితం చేస్తున్న కార్మికుల కుటుంబాలకు కనీస భద్రత కూడా కల్పించ లేకపోతే యాజమాన్యం బాధ్యత ఏమిటి?" అని ఆమె ప్రశ్నించారు. అలాగే, ఉన్నతాధికారుల క్వార్టర్లకు ఒక న్యాయం, కార్మికుల నివాసాలకు మరో న్యాయమా?" అని ప్రశ్నించిన పాల్వంచ దుర్గ, కార్మికుల సమస్యల పట్ల యాజమాన్యం వివక్షతో వ్యవహరిస్తోందని ఆరో పించారు. ఉన్నతాధికారుల నివాస ప్రాంతాల్లో అన్ని సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు ఉండగా, కార్మికుల కాలనీలు మాత్రం నిర్లక్ష్యానికి గురవుతున్నాయని అన్నారు. సింగరేణి అభివృద్ధికి శ్రమిస్తున్న కార్మికుల ప్రాణాలు, వారి కుటుంబాల భద్రత కంటే ముఖ్యమైనది మరొకటి లేదని పేర్కొంటూ, అధికారులు ఇకనైనా స్పందించి తక్షణ



చర్యలు చేపట్టాలని ఆమె కోరారు. అలాగే కార్మిక కాల నీల్లో వెంటనే ప్రహరీ గోడల నిర్మాణం, కాలం చెల్లిన క్వార్టర్ల మరమ్మతులు లేదా పునర్నిర్మాణం, పశువుల నియంత్రణ, భద్రతా చర్యల బలోపేతం, మౌలిక సదుపాయాల కల్పన చేపట్టి కార్మికుల ప్రాణాలకు భరోసా కల్పించాలని సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్, డైరెక్టర్లకు పాల్వంచ దుర్గ విజ్ఞప్తి చేశారు.

# మల్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా బత్తిని శ్రీనివాస్ గౌడ్

జూన్ 9,నీలగిరి వార్త:



కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలోని మల్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా కొండగట్టుకు చెందిన బత్తిని శ్రీనివాస్ గౌడ్ ను చొప్పదండి నియోజకవర్గం ఎమ్మెల్యే డిసిసి అధ్యక్షులు డా మేడిపల్లి సత్యం నియామకం చేసారు.గత చాలా సంవత్సరాలుగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ముఖ్య అనుచరుడిగా నమ్మకంగా ఉంటూ పార్టీకి సేవలందిస్తున్నందుకు గుర్తింపు ఇచ్చిన ఎమ్మెల్యే కు తన నియామకానికి సహకరించిన నియోజకవర్గం, మల్యాల మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు బత్తిని శ్రీనివాస్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకొని వెళ్ళడానికి ఎల్లవేలలా కృషి చేస్తానని అన్నారు. అభివృద్ధికి మారుపేరు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అని కొనియాడారు.

# పాడి రైతులకు బిల్లులు వెంటనే చెల్లించాలి...

### లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తాం...

### మదర్ డైరీ యాజమాన్యానికి రైతుల హెచ్చరిక.

నీలగిరి వార్త: సూర్యాపేట జిల్లా :

మదర్ డైరీ యాజమాన్యం రైతులకు పాల బిల్లులు చెల్లించే విషయంలో జాప్యం చేయడానికి నిరసిస్తూ కోదాడ పట్టణ పరిధిలోని బాలాజీ నగర్ మదర్ డైరీ పాల కేంద్రం వద్ద మంగళవారం రైతులు భారీగా ధర్నా నిర్వహించారు. పాల ఉత్పత్తిదారుల సంఘం కార్మిక నాయకుడు జీవన్ నాయక్, చిలుకూరు పాల ఉత్పత్తిదారుల సంఘం నాయకులు వెంకటయ్య లు మాట్లాడుతూ గత సంవత్సర కాలంగా పాడి రైతులకు సుమారు 17 లక్షల రూపాయలు బాకీ ఉన్నందున రైతులకు వెంటనే బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులు గేదెలకు బ్యాంకు రుణాలు చెల్లించేందుకు ప్రతినెల పాలను కేంద్రానికి అమ్మి తద్వారా వచ్చిన డబ్బులను బ్యాంకులకు చెల్లించాలి. కానీ మదర్ డైరీ వారు రైతనే రైతుల బకాయిలను చెల్లించకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుట్ట నున్నట్లు తెలిపారు. మదర్ డైరీ సీఈవో లింగారెడ్డి మాట్లాడుతూ.. బాలాజీ నగర్ లోని మదర్ డైరీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులను ఓదార్చి రాగల 20 రోజుల్లో యాజమాన్యంతో మాట్లాడి రైతుల బకాయిలను పూర్తిస్థాయిలో చెల్లించేందుకు కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో పాల ఉత్పత్తిదారులు ధర్నాలు నిర్మించారు. ఈ కార్యక్రమంలో నారాయణపురం బాలాజీ నగర్ చిలుకూరు పాల ఉత్పత్తిదారుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# గుండారం కళాశాలకు ఇంటర్ అడ్మిషన్ల జోరు.






### 110 కి చేరిన నూతన అడ్మిషన్లు.

కమాన్ పూర్ నీలగిరి వార్త: జూన్ 9.

కమాన్ పూర్ మండలం గుండారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం నూతన అడ్మిషన్లకు జోరందుకుంది. పెద్దపెల్లి జిల్లా వ్యాప్తంగా మొత్తం జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ కు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడం జరిగింది ఇందులో మంగళవారం వరకు 110 మంది విద్యార్థులు తమ అడ్మిషన్లు తీసుకున్నారు. అలాగే చాలా వరకు అడ్మిషన్లు రావడం జరుగుతుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల గుండారం ప్రిన్సిపాల్ సుధాకర్ తెలిపారు.కమాన్ పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల 110,గోదావరిఖని ప్రభుత్వ జూనియర్ కళాశాల మార్కండేయ కాలనీ 20, ప్రభుత్వ జూనియర్ కళాశాల ధర్మారం 78, గోదావరిఖని జూనియర్ కళాశాల గర్ల్స్ 90, రామగుండం జూనియర్ కళాశాల 29, సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల 48, కాల్వ శ్రీరాంపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల 11, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఓదెల 32, ప్రభుత్వ జూనియర్ కళాశాల బాయ్స్ పెద్దపల్లి 29, ప్రభుత్వ జూనియర్ కళాశాల గర్ల్స్ 61, మంథని బాయ్స్ కళాశాల 14, మంథని గర్ల్స్ జూనియర్ కళాశాల 23, ముత్తారం ప్రభుత్వ జూనియర్ కళాశాల 15 నూతన అడ్మిషన్లు చేర్చుకున్నారు.

విద్యకు పట్టం కట్టుకున్న కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్.

కమాన్ పూర్ మండలంలోని గుండారం ప్రభుత్వ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్ చదివేందుకు విద్యార్థుల సంఖ్య దినం దినం పెరుగుతోందని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఇటీవల కళాశాలలో రామగిరి, కమాన్ పూర్, పెద్దపల్లి మండలాల సర్పంచులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయగా వారి మద్దతుతో విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని పేర్కొన్నారు. అలాగే ఉత్తమ ఉపాధ్యాయులచే ప్రత్యేక బోధన వల్ల తమ కళాశాల ఉత్తీర్ణత శాతం పెరిగిందని దీంతో గుండారం కళాశాల వైపు విద్యార్థులు చూస్తున్నారని చేరుతున్నారని పేర్కొన్నారు. తమ కళాశాలకు మద్దతు పలకాలని ప్రజాప్రతినిధులను ప్రిన్సిపల్ సుధాకర్ కోరారు.

# హామీని చేతల్లో చూపిన నాయకత్వం

### మాదారంలో బోర్‌వెల్ పనులకు శ్రీకారం

నీలగిరి వార్త::తాండూర్

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీని అమలు చేస్తూ మాదారం గ్రామపంచాయతీ పరిధిలో త్రాగునీటి అవసరాల కోసం నూతన బోర్‌వెల్ పనులను మంగళవారం ప్రారంభించారు. డీఎంఎఫ్‌టీఏ నిధుల ద్వారా చేపట్టిన ఈ పనులకు డీసీసీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి ప్రత్యేక కృషి చేయగా, ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకట్ స్వామి సహకారంతో నిధులు మంజూరయ్యాయి.ఈ సందర్భంగా డీసీసీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి, సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్ కొబ్బరికాయ కొట్టి బోర్‌వెల్ పనులను ప్రారంభించారు. నూతన బోర్‌వెల్ మంజూరుతో గ్రామ ప్రజల్లో ఆనందం వెల్లివిరిసింది. త్రాగునీటి సమస్యకు పరిష్కారం దొరకనుందనే ఆశాభావాన్ని గ్రామస్తులు వ్యక్తం చేశారు.సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్, ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి మాట్లాడుతూ, స్థానిక ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు గ్రామంలో నిత్యావసరమైన త్రాగునీటి సౌకర్యం కల్పించేందుకు బోర్‌వెల్ మంజూరు చేయించినట్లు తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకట్ స్వామి పూర్తిస్థాయిలో సహకరించారని, డీఎంఎఫ్‌టీఏ నిధుల మంజూరుకు కృషి చేశారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నీలయపల్లి సర్పంచ్ పులవేణి తిరుపతి, ఉప సర్పంచ్ రాపల్లె సత్తి, వార్డు సభ్యుడు కత్తర్ల రవి, కాంగ్రెస్ నాయకులు వీసా శంకర్, భూత్కూరి కమలాకర్, తోటపల్లి ఎల్లయ్య, రాజారాం చందర్, ఓరుగంటి సుధాకర్, గోన శ్రీనివాస్‌తో పాటు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# బడిబాటలో విద్యార్థుల నమోదు పెంపొందించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య

నీలగిరి వార్త:, మంచిర్యాల,

జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల నమోదు పెంపొందించాలని జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా పౌరసరఫరాల బ్రహ్మారావు జిల్లా విద్యాశాఖ సహాయ సంచాలకులు గాంధీ బాలికల విద్యాలయాల ప్రత్యేక అధికారులు ఆదర్శ పాఠశాలల ప్రిన్సిపాల్ లతో జూమ్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీన పాఠశాలలు ప్రారంభం అవుతున్న దృష్ట్యా పాఠశాల తరగతి గదులు ఆవరణ శుభ్రం చేయించాలని వంటగది వంట పాత్రలు శుభ్రపరచాలని మధ్యాహ్న భోజనానికి అవసరమైన బియ్యం సమకూర్చుకోవాలని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలకు పాఠ్యపుస్తకాలు నోటు పుస్తకాలు చేరుకున్నాయని వెంటనే పాఠశాలలకు చేరవేయాలని మండల విద్యాధికారులకు సూచించారు బడిబాట కార్యక్రమంలో గత సంవత్సరంలో ఉన్న నమోదు కంటే ఈ సంవత్సరం 10 శాతం అడ్మిషన్లు పెంపొందించేలా కృషి చేయాలని తెలిపారు. ప్రతి ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తన పాఠశాలలో 5 7 8 తరగతి పూర్తి చేసిన ( విద్యాధికారికి నిర్ణీత నమూనాలో సమర్పించాలని తెలిపారు. 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థిని సమీప జూనియర్ కళాశాలలో చేర్పించాలని ప్రతి విద్యార్థి ప్రాథమిక పాఠశాల దశ నుండి ఇంటర్మీడియట్ దశ వరకు నిరాటంకంగా చదువు కొనసాగించేలా డ్రాప్ అవుట్ కాకుండా చూడాలని తద్వారా 100 శాతం విద్యాభివృద్ధి సాధ్యమవుతుందని తెలియజేశారు. ప్రతి ప్రభుత్వ ప్రైవేటు యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలను



వదిలి వెళుతున్న విద్యార్థులకు బదిలీ సర్టిఫికెవిద్యార్థి నూతనంగా ప్రవేశం పొందిన పాఠశాల ప్రవేశ వివరాలను నిర్ణీత నమూనాలో రికార్డులో భద్రపరచాలని మండల విద్యాధికారికి సమర్పించాలని తద్వారా డ్రాప్ బాక్స్ లో ఏ విద్యార్థి ఉండకుండా డ్రాప్ అవుట్ కాకుండా చూడాలని తెలిపారు. భవిత కేంద్రాలు సరైన క్రమంలో నడిచే విధంగా మండల విద్యాధికారులు చర్యలు తీసుకోవాలని జూన్ 15న ఏదైనా పాఠశాల పున:ప్రారంభం కానట్లయితే సంబంధిత ప్రధానో పాధ్యాయులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని మధ్యాహ్న భోజనం మొదటి రోజు నుండి అమలు చేయాలని తెలిపారు. ప్రైవేటు పాఠశాలలు తాము వసూలు చేస్తున్న ఫీజుల వివరాలను నోటీస్ బోర్డ్ పై ప్రదర్శించాలని, మండల విద్యాధికారులు ప్రైవేట్ పాఠశాలలను పర్యవేక్షణ చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో విద్యాశాఖ సెక్టోరల్ అధికారులు ఎం.భరత్ కుమార్ జే. సత్తయ్య కె. కృష్ణమూర్తి కే. విజయలక్ష్మి ఏ.రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల ప్రతిభకు ప్రోత్సాహం - మెగా పేరెంట్స్ డేలో రూ. లక్ష బహుమతి ప్రకటించిన

## ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి









**మార్కాపురం, జూన్ 9 నీలగిరి వార్త::**

మార్కాపురం పట్టణంలోని జడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ శిక్షణ తరగతులను మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. 1, 2 తరగతుల విద్యార్థులకు ఆటపాటలతో కూడిన బోధన అందించడంలో ఎఫ్ ఎల్ ఎన్ శిక్షణ కీలక పాత్ర పోషిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. చిన్నారులకు ప్రారంభ దశలోనే పటిష్టమైన విద్యా పునాది వేయడం ద్వారా వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దవచ్చని అన్నారు. ఈ సందర్భంగా మార్కాపురం నియోజకవర్గంలోని గొట్లగట్టు జడ్పీ హైస్కూల్ విద్యార్థి పదో తరగతి పరీక్షల్లో 592 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల ప్రతిభను చాటిన విషయాన్ని గుర్తుచేశారు. ఆ విద్యార్థిని తీర్చిదిద్దిన పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఈ నెల 19న జరగనున్న మెగా పేరెంట్స్ డే కార్యక్రమంలో తన వ్యక్తిగత నిధుల నుంచి రూ. 1,00,000 ప్రోత్సాహక బహుమతి అందజేస్తానని ప్రకటించారు. అదేవిధంగా నియోజకవర్గంలో 580కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులు ఉన్న పాఠశాలలను త్వరలో స్వయంగా సందర్శించి, ఉపాధ్యాయులు, విద్యార్థులను ప్రోత్సాహక బహుమతులతో సత్కరిస్తానని తెలిపారు. మంచి విద్య ద్వారానే విద్యార్థులను ఉన్నత స్థానాలకు చేర్చగలమని, ఆ బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్న గురువులందరికీ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# వైసీపీ విష ప్రచారాలను రైతులు నమ్మొద్దు.

## దుష్ప్రచారం చేస్తే జైలుకే: మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరిక

**అమరావతి, జూన్ 9నీలగిరి వార్త:**

తోతపూరి మామిడి రైతులను తప్పుదోవ పట్టిస్తూ వైసీపీ అనుబంధ సోషల్ మీడియా వర్గాలు, కొందరు రాజకీయ ప్రేరేపిత వ్యక్తులు చేస్తున్న విష ప్రచారాలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మామిడి కొనుగోళ్లు, పల్ప్ పరిశ్రమలకు సంబంధించిన అంశాల్లో ప్రభుత్వాన్ని, ప్రజాప్రతినిధులను లక్ష్యంగా చేసుకుని వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియా వేదికల్లో అసత్యాలు ప్రచారం చేయడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. రైతుల్లో అయోమయం సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలనే కుట్రలో భాగంగానే ఈ తప్పుడు ప్రచారాలు జరుగుతున్నాయని ఆరోపించారు. వైసీపీ మరోసారి తన నీచమైన, దిగజారుడు రాజకీయాలకు తెరలేపిందని మంత్రి విమర్శించారు. రైతుల సంక్షేమం వంటి సున్నితమైన అంశాలను కూడా రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం అత్యంత బాధ్యతారాహిత్యమని అన్నారు. ప్రజల్లో గందరగోళం సృష్టించడం, ప్రభుత్వంపై బురదజల్లడం, అబద్ధాలను నిజాలుగా చిత్రీకరించడం వైసీపీకి అలవాటుగా మారిందని ఆయన పేర్కొన్నారు. ఎవరు ఎంత దుష్ప్రచారం చేసినా ప్రభుత్వం రైతుల పక్షానే నిలుస్తుంది. ఆధారాలు లేకుండా అబద్ధాలు సృష్టించి వాట్సాప్ గ్రూపుల్లో, సోషల్ మీడియాలో వైరల్ చేస్తే సహించేది లేదు. అలాంటి వారిని గుర్తించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. అవసరమైతే క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తాం అని మంత్రి హెచ్చరించారు. గత ఏడాది మామిడి రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్న సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను ఆదుకుందని గుర్తు చేశారు. రైతులకు నష్టం జరగకుండా తీసుకున్న చర్యల వల్ల వేలాది మంది రైతులకు ఊరట లభించిందన్నారు. ఈ ఏడాది కూడా మామిడి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర లభించేలా, కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగేలా, పరిశ్రమలతో సమన్వయం ఉండేలా అధికారులకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. రైతుల పేరుతో రాజకీయాలు చేసే వైసీపీ నేతలు, సోషల్ మీడియా ముఠాలు అసత్య ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. రైతుల సంక్షేమంపై ప్రభుత్వానికి పూర్తి నిబద్ధత ఉందని, వారి ప్రయోజనాలను కాపాడటంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. మామిడి రైతులు ఎవరూ తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, ఏ సమస్య ఉన్నా ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని మంత్రి అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు.




# స్థానిక ఎన్నికల విజయమే లక్ష్యం - పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలి:

## ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు





**వినుకొండ, జూన్ 9 నీలగిరి వార్త::**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని తెలుగుదేశం పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేసి కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని ఏపీ ప్రభుత్వ చీఫ్ విప్, జీవీ ఆంజనేయులు పిలుపునిచ్చారు. వినుకొండ పట్టణంలోని గంగినేని ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ మండల పార్టీ సందర్భంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ విధివిధానాలు, బాధ్యతలు, అమలు ప్రక్రియపై సవివరంగా వివరించారు. అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణులు చేపట్టాల్సిన కార్యాచరణ, ఎన్నికల సన్నద్ధత, ఓటరు జాబితాల నిర్వహణ, క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన కార్యక్రమాలపై నాయకులకు, కార్యకర్తలకు అవగాహన కల్పించారు.

రాబోయే ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి నాయకుడు, కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని, ప్రజలతో మరింత మమేకమై పార్టీ బలోపేతానికి కృషి చేయాలని జీవీ ఆంజనేయులు సూచించారు. ఈ కార్యక్రమంలో మక్కెన మల్లికార్జున రావు, పరిశీలకులు వక్కలగడ్డ మల్లికార్జున రావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# యోగాతోనే ఆరోగ్యకరమైన జీవితం

## - జిల్లా కలెక్టర్ విజయ సునీత.

**కంభం జూన్ 9 నీలగిరి వార్త:**





యోగాతోనే ఆరోగ్యకరమైన జీవితం సాధ్యమని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత పేర్కొన్నారు. యోగాంధ్ర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కంభం చెరువు కట్టపై నిర్వహించిన ప్రత్యేక యోగా కార్యక్రమానికి భారీగా ప్రజలు తరలివచ్చారు. జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి, ఇతర అధికారులు గంటపాటు ఆసనాలు చేసి యోగ విశిష్టత, ప్రాముఖ్యతను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 5 వేల సంవత్సరాల క్రితమే రుషులు యోగా చేయడం వల్ల కలిగే అద్భుత ప్రయో జనాలను తెలియ జేశారన్నారు. యోగ ప్రాణాయామం తో ఆత్మవిశ్వాసం, ఓపిక పెరుగుతా యని వివరించారు. అదేవిధంగా జీర్ణ క్రియ, రోగ నిరోధక శక్తి, బీపీ, షుగర్ వంటి వాటికి యోగ ప్రత్యేక సాధనంగా పనిచేస్తుందన్నారు. ఖర్చు లేకుండా అందరికీ అందుబా టులో ఉండే ఆరోగ్య సాధనం ఒక్క యోగా మాత్రమేనని తెలిపారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి మాట్లాడుతూ జీవితంలో యోగాను ప్రతి ఒక్కరు భాగం చేసుకోవాలన్నారు. కంభం చెరువును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. రాబోయే 3 నెలల్లో కంభం చెరువులో బోటు విహార యాత్రలు మొదలు పెడతామన్నారు. కూటమి ప్రభుత్వం చెప్పిన విధంగా ఇటు సంక్షేమం, అభివృద్ధిలో ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, మార్కాపురం, కనిగిరి ఆర్డీవోలు వెంకట శివరామిరెడ్డి, అజయ్ కుమార్, డీఎస్పీ నాగరాజు, విద్యుత్ శాఖ ఎస్ఈ కరీం, ఐసిడిఎస్ ఇన్చార్జి పీడీ పద్మావతి, డి ఎల్ డి వో బాలు నాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# కంబం మండలంలో ట్రైసైకిళ్లు, డస్ట్‌బిన్ల పంపిణీ ప్రారంభం

## పరిశుభ్ర గ్రామాలే లక్ష్యం - కలెక్టర్ విజయ సునీత, ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి

**కంబం, జూన్ 9 నీలగిరి వార్త::**

గ్రామాల్లో పరిశుభ్రతను మెరుగుపరచడం, వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా అమలు చేయడం లక్ష్యంగా కంబం మండలంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద ట్రైసైకిళ్లు, డస్ట్‌బిన్ల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ విజయ సునీత, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి, పచ్చజెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణ, చెత్తను సక్రమంగా సేకరించడం, ఎక్కడపడితే అక్కడ చెత్త వేయడాన్ని అరికట్టడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజారోగ్యాన్ని కాపాడవచ్చన్నారు. చెత్త నిర్వహణ సక్రమంగా ఉంటే దోమల వ్యాప్తి తగ్గి, సీజనల్ వ్యాధులను నివారించవచ్చని పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కంబం మండలానికి 27 ట్రైసైకిళ్లు అందజేశారు. గ్రీన్ అంబాసిడర్లుగా పనిచేస్తున్న సిబ్బంది ప్రతి ఒక్కరూ సుమారు 250 గృహాల నుంచి చెత్త సేకరించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి తెలిపారు. పరిశుభ్రత ప్రతి పౌరుడి బాధ్యత అని, స్వచ్ఛ ఆంధ్ర లక్ష్య సాధనలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని ఆయన అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న పరిశుభ్రత కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. ట్రైసైకిళ్లు, డస్ట్‌బిన్ల పంపిణీతో చెత్త సేకరణ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని, గ్రామాలు, పట్టణాలు మరింత పరిశుభ్రంగా మారుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



